



అమరావతికి మళ్లీ అంకురార్పణ

- రాజధానిలో పునర్నిర్మాణ పనులకు శ్రీకారం
- శాస్త్రోక్తంగా పూజలతో రాయపూడి వద్ద పనుల ప్రారంభం
- రైతుల హర్షధ్వానాల మధ్య సీఎం చంద్రబాబు భూమిపూజ
- మూడేళ్లలో రాజధాని పనులు పూర్తి కావాలని సీఎం ఆదేశం

తుళ్లూరు, గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం బాటలు వేసింది. ఎక్కడికక్కడ నిలిచిపోయిన పనులను అధికారంలోకి వచ్చిన ఐదో నెలలోనే తిరిగి ప్రారంభించింది. వైసీపీ ప్రభుత్వం అడివిలా మార్చిన రాజధాని ప్రాంతంలో తొలుత జంగిల్ క్లియరెన్స్ చేపట్టింది. బాధ్యతలు చేపట్టిన వెంటనే సీఎం చంద్రబాబు రాజధాని అంతటా పర్యటించారు. నిలిచిపోయిన పనులను పరిశీలించి వాటిని ఎలా తిరిగి పట్టాలెక్కించాలనే దానిపై అవగాహనకు వచ్చారు. మరోవైపు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ తరచూ అమరావతిలో పర్యటించి పనుల పునః ప్రారంభానికి బాటలు వేశారు. ఈ పరిస్థితుల్లో ఎప్పటి నుంచి అమరావతి పనులు ప్రారంభిస్తారని రాజధాని ప్రాంత ప్రజలే కాకుండా రాష్ట్రమంతటా ఎదురు చూస్తున్న క్రమంలో శనివారం సీఎం చంద్రబాబునాయుడు అమరావతి పునర్నిర్మాణ పనులకు అంకురార్పణ చేశారు. ప్రజల హర్షధ్వానాల మధ్య శాస్త్రోక్తంగా పూజలతో రాజధాని పనులను ప్రారంభించారు. రాయపూడి వద్ద జీ ప్లస్ 7 విధానంలో నిర్మించతలపెట్టిన సీఆర్డీయే కార్యాలయం నిర్మాణం గత ప్రభుత్వంలో నిలిచిపోగా దాని నిర్మాణం పూర్తి చేసేందుకు పనులు పునః ప్రారంభించారు. అనంతరం సీఎం మాట్లాడారు. అమరావతిలో రూ.160 కోట్లతో జీ ప్లస్ 7 భవనం నిర్మిస్తున్నామని దీనిని 121వ రోజున ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రానికి అమరావతి ఒక్కటే రాజధానిగా ఉంటుందని స్పష్టం చేశారు. అమరావతే రాజధాని అని విశాఖ, కర్నూలు వాసులతో ఒప్పించానన్నారు. రైతులకు కౌలు పెండింగ్ నిధులు 170 కోట్లు ఇచ్చామని, రూ.225 కోట్లు త్వరలో ఇస్తామన్నారు.



రాజధాని పనులకు భూమిపూజ చేస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్



రాజధాని మ్యాప్‌ను సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న సీఆర్‌డీఏ అధికారులు

విధ్వంసం పోయి.. నిర్మాణం ప్రారంభం

1631 రోజులు పాటు రాజధానిని కాపాడుకోవడం కోసం రైతులు ఉద్యమం చేశారని చంద్రబాబు తెలిపారు. విధ్వంసం పోయింది.. నిర్మాణం ప్రారంభమైందన్నారు. గత పాలకుల విధ్వంసంతో నిలిచిన పనుల వల్ల రూ.7 వేల కోట్లు అదనంగా భారం పడుతోందన్నారు. రూ.52 వేల కోట్లతో పనులు ప్రారంభిస్తామని, కేంద్రం రూ.15 వేల కోట్లు అందించేందుకు ముందుకొచ్చిందన్నారు. 8,603 కి.మీ సీఆర్డీయే, 217 చ.కిమీ పరిధిలో రాజధాని, 16.9 చ.కి పరిధిలో కోర్ కేపిటల్ ఉంటుందన్నారు. అమరావతిలో తలపెట్టిన పనులన్నీ మూడేళ్లలో పూర్తి కావాలని సీఆర్డీఏ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, కలెక్టర్ నాగలక్ష్మి, సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, అడిషనల్ కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్, ఎస్పీ సతీష్‌కుమార్, రైతు నాయకులు పువ్వాడ సుధాకరరావు జోజాల చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

రుద్రమదేవిలా రాజధాని మహిళలు

అమరావతికి మళ్లీ ప్రాణప్రతిష్ఠ చేశామని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రం కోసం రైతులు భూములు ఇస్తే గడిచిన ప్రభుత్వం ఎన్నో ఇబ్బందులు పెట్టిందన్నారు. రాజధాని ఉద్యమ సమయంలో ఇక్కడి మహిళలు రాణీరుద్రమ దేవిలా పోరాడారన్నారు. న్యాయస్థానం నుంచి దేవస్థానం కార్యక్రమం చేపడితే అన్నం తిననివ్వకుండా అడగడుగునా వేధించారన్నారు. ఈ పవిత్రమైన పుణ్యభూమిని మహిళ శక్తి కాపాడిందని తెలిపారు. ఎంతమంది రాక్షసులు వచ్చినా అమరావతిని కాపాడిన చరిత్ర రైతులదేనన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అమరావతిపై విష ప్రచారం చేసిందన్నారు. ముంపు ఎడారి అన్న జగన్‌రెడ్డి బెంగళూరు ప్యాలెస్ మునిగిందన్నారు. దేవుడు స్క్రిప్ట్ అంటే ఇదేనని చంద్రబాబు తెలిపారు.

మగువ మేలుకో.. తెలుసుకో



- మహిళలకు రక్షణగా రాజ్యాంగం
- ప్రభుత్వం కల్పించిన చట్టాలు కోకొల్లలు
- అతివల అరచేతిలోనే టోల్ ఫ్రీ నెంబర్లు
- అవగాహన లేమితో తలెత్తుతున్న సమస్యలు
- మహిళలను చైతన్య పరచడంలో వెనకడుగే

8లో

విగ్రహం.. వివాదం

- తొలగింపుపై నివేదిక కోరిన ఉన్నతాధికారులు
- దిద్దుబాటు చర్యలు చేపట్టిన టీడీపీ నేతలు
- ఇరకాటంలో నరసరావుపేట మున్సిపల్ అధికారులు
- పార్కులో విగ్రహం ఏర్పాటు తెలియదన్న కమిషనర్

నరసరావుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట స్టేషన్ రోడ్డులోని పార్కులో ఉన్న తెలుగు తల్లి విగ్రహం తొలగింపు వివాదాస్పదమైంది. ఈ ఘటనపై ఉన్నతాధికారులు నివేదిక కోరారు. దీంతో మున్సిపల్ అధికారులు ఇరకాటంలో పడ్డారు. నరసరావుపేటలో తెలుగు తల్లికి అవమానం అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంతో ఉన్నతాధికారులు స్పందించి చర్యలకు ఆదేశించారు. మున్సిపాల్టీ స్థలంలో ఉన్న తెలుగు తల్లి విగ్రహాన్ని అనుమతి లేకుండా తొలగించిన టీడీపీకి చెందిన వ్యక్తే దానిని గాంధీ పార్కులో శనివారం ఏర్పాటు చేశారు. అధికారం ఉంది ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందన్న రీతిలో కొందరు టీడీపీ నేతలు వ్యవహరిస్తున్నారనేందుకు ఈ ఘటనలే నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు. విగ్రహం తొలగింపు.. తిరిగి ఏర్పాటు తమకు తెలియదని మున్సిపల్ కమిషనర్ జస్వంత్ స్పష్టం చేశారు. ఈ సంఘటనలపై విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. విగ్రహం తొలగింపుపై మున్సిపల్ ప్రత్యేక అధికారైన ఆర్డీవోను కలెక్టరేట్ నుంచి కూడా నివేదిక కోరినట్లు సమాచారం. విగ్రహాన్ని ఉన్న స్థానం నుంచి మరో చోటకు మార్చాలంటే కౌన్సిల్ అనుమతి తప్పనిసరి. అయితే ఎన్నికలు జరగకపోవడంతో కౌన్సిల్ లేదు. ప్రత్యేక అధికారిగా ఉన్న ఆర్డీవో అనుమతి తీసుకుని విగ్రహాన్ని మార్చాలి. ఇవేవి లేకుండా ఇష్టారాజ్యంగా విగ్రహం విషయంలో అధికార పార్టీ వ్యక్తి వ్యవహరించాడం వివాదాస్పదమైంది. పార్టీలోని కొందరు నేతలు ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబును లక్ష్యపెట్టడం లేదన్న విమర్శలున్నాయి. ఆయనకు తెలిస్తే ఈ ఘటనలను ప్రోత్సహించరన్న వాదన నేతల్లో ఉంది. విగ్రహం వద్ద అపరిశుభ్రత నెలకొనడంతో మార్చాలనుకున్నామని కొందరు నేతలు చెబుతున్నారు. అయితే దీనిపై అధికారులకు వినతిపత్రం ఇచ్చి చర్యలు తీసుకునేలా చూడాలి. అలాకాకుండా రాత్రికి రాత్రి విగ్రహాన్ని తొలగించడాన్ని పార్టీ వ్యక్తులు ఎలా సమర్థించుకుంటారన్న ప్రశ్నలు వస్తున్నాయి.



గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన తెలుగు తల్లి విగ్రహం


పేదలపై ఫీజుల పిడుగు

- విద్యా హక్కు చట్టం ప్రవేశాలకు బ్రేక్
- ప్రైవేటు పాఠశాలలకు అనుకూలంగా తీర్పు
- ఫీజులు చెల్లించాలని యాజమాన్యాల ఒత్తిడి
- ఆందోళనలో తల్లిదండ్రులు.. స్పష్టత ఇవ్వని విద్యాశాఖ
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1500పైగా ఆర్టీఈ విద్యార్థులు



గుంటూరు(విద్య), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం(ఆర్టీఈ) ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలు పొందిన పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్నచందంగా తయారైంది. ఇప్పటికే విద్యా సంవత్సరం సగం గడిచింది. ఈ సమయంలో ఆర్టీఈ ప్రవేశాలపై ప్రైవేటు విద్యా సంస్థలకు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో 25 శాతం సీట్లకు సంబంధించి గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు 24ను ఇటీవల హైకోర్టు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని తల్లిదండ్రులపై ఒత్తిడి పెంచుతున్నాయి. న్యాయస్థానం నుంచి ఉత్తర్వులు వచ్చి రెండు రోజులు కాకముందే ప్రైవేటు యాజమాన్యాలు తమ ఫీజులపై జులుం ప్రదర్శిస్తున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలలో విద్యా హక్కు చట్టం ప్రకారం అడ్మిషన్లు పొందిన 1500 మందికిపైగా విద్యార్థుల పరిస్థితి ఏమిటనేది తెలియడం లేదు. వీరిలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల పిల్లలే ఎక్కువగా ఉన్నారు. మరింత ఆందోళన కరమైన విషయం ఏమిటంటే హెచ్ఐవీ బాధిత తల్లిదండ్రుల పిల్లలు కూడా వీరిలో ఉన్నారు. ఆయా వర్గాలు వేలకువేలు ఫీజులు చెల్లించుకోలేరు. అయినా విద్యాహక్కు చట్టం ప్రకారం ఆయా వర్గాలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించారు. ఆ చట్టాన్ని కోర్టు రద్దు చేయడంతో పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకువస్తున్నాయి. అంతంత ఫీజులు కట్టే స్థితిలో చాలామంది తల్లిదండ్రులు లేరు. ఫీజులు కట్టకపోతే అడ్మిషన్లు రద్దు చేస్తామని యాజమాన్యాలు బెదిరిస్తున్నాయి. విద్యా సంవత్సరం సగంలో పిల్లల్ని వేరే పాఠశాలలో చేర్పించే అవకాశం లేదు. దీంతో ఏమి చేయాలో పాలుపోక తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఫీజులపై యాజమాన్యాల ఒత్తిళ్లు.. తల్లిదండ్రులు ఈ విషయంలో ఆందోళనలో ఉన్నా విద్యా శాఖ మౌనంగా ఉంది. విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల్ని చేర్పించే విషయంలో విద్యాశాఖ అనేక సార్లు ప్రకటనలు విడుదల చేసింది. ఈ ప్రకారం పలు కార్పొరేట్ పాఠశాలల్లో పేద విద్యార్థుల్ని అధికారులు చేర్పించారు. తాజాగా జీవో రద్దు కావడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నా విద్యాశాఖ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. యాజమాన్యాలు కోరినట్లు ఇప్పటికిప్పుడు వేలాది రూపాయల ఫీజులు చెల్లించాలంటే తమవల్లకాదని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆర్టీఈ కింది చేరిన విద్యార్థులకు ఆయా పాఠశాలలను బట్టి రూ.25 వేల నుంచి రూ.35 వేలు ఫీజులు నిర్ధేశించాయి. తొలి విడత దీపావళిలోపు రూ.10 వేలు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నాయి. ఇప్పటికే తల్లిదండ్రుల్ని వ్యక్తిగతంగా పాఠశాలలకు పిలిచి ఫీజులపై ఒత్తిడి తీసుకు వస్తున్నట్లు సమాచారం. నాటి వైసీపీ ప్రభుత్వం కనీసం విద్యాసంస్థల యాజమాన్యాలతో సమీక్ష కూడా నిర్వహించకుండా ఈ జీవోను తీసుకువచ్చింది. దీంతో కొన్ని పాఠశాలల యాజమాన్యాలు యునైటెడ్ ప్రైవేటు ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ఫెడరేషన్(యూపీఈఐఎఫ్)గా ఏర్పడి న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. తాజాగా న్యాయం స్థానం ప్రైవేటు స్కూల్స్‌కు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఫలితంగా ఆర్టీఈ ద్వారా చేరిన పేద కుటుంబాల పిల్లలపై పిడుగు పడినట్లు అయింది.

నాగార్జునసాగర్ 12 క్రస్ట్ గేట్ల ద్వారా నీరు విడుదల



8

తవ్వకాలు ఎప్పుడో?

- ఖరారు చేయని ఇసుక టెండర్లు
- జిల్లాలో ఆరు రీచ్‌ల ఖరారులో జాప్యం
- యార్డుల్లో నిల్వలతో మరో వారం మాత్రమే సరఫరా



మాదిపాడులో ఇసుక లోడింగ్

నరసరావుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోజురోజుకు ఇసుక నిల్వలు తరిగిపోతున్నాయి. మైనింగ్‌శాఖ లెక్కల ప్రకారం స్టాక్‌యార్డులో వారం రోజులకు సరపడా మాత్రమే నిల్వలున్నాయి. అయినా ముందస్తు చర్యలు తీసుకోవడంలో మైనింగ్ శాఖ విఫలమైందన్న విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో ఆరు రీచ్‌లకు మైనింగ్‌శాఖ టెండర్లు తెరిచినా ఇంకా ఖరారు చేయలేదు. టెండర్లు తెరిచి వారమవుతున్నా ఏరోజుకారోజు ఖరారు చేస్తామని మైనింగ్ జిల్లా అధికారి నాగయ్య చెబుతూ వస్తున్నారు. శనివారం సాయంత్రం వరకు టెండర్లు ఖరారు చేయలేదు. రాజకీయ జోక్యం పెరగడంతో టెండర్ల ఆమోదం అధికారులకు ఇబ్బందికరంగా మారిందని సమాచారం. టెండర్లు ఖరారులో జాప్యంపై పలు అను మానాలు వస్తున్నాయి. అంబడిపూడిలో మూడు రీచ్‌లు, దిడుగు, కోనూరు, పొందుగలలో ఒక్కొక్క రీచ్‌లో ఇసుక తవ్వకాలకు మైనింగ్ శాఖ టెండర్లు నిర్వహించింది. ఈ రీచ్‌ల్లో 4.23 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలు అందు బాటులో ఉన్నట్లు మైనింగ్ శాఖ ప్రకటించింది. ఇసుక తవ్వకాలకు సంబంధించిన టెండర్లు ఏ రేట్లకు ఆమోదించారు. ఏ సంస్థ టెండర్ దక్కించు కుందో వివరాలను మైనింగ్ శాఖ ఎప్పటికి బహిర్గతం చేస్తుందో చూడాలి.

వరదతో తవ్వకాలకు ఆటంకం

కృష్ణానదికి వరద పోటెత్తుతోంది. దీంతో ఇసుక తవ్వకాలకు జరిగే పరిస్థితులు లేవు. సాగర్ నుంచి 1.40 లక్షల కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఆరు ఇసుక రీచ్‌లలో నీరు ప్రవహిస్తోంది. సాగర్ నుంచి నీటి విడుదల పూర్తిగా నిలిపివేసిన వారం వరకు ఇసుక తవ్వకాలు జరిగే అవకాశం ఉండదని మైనింగ్ శాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో ఇసుక కొరత మరింత అధికమయ్యే అవకాశం ఉంది. మాదిపాడు యార్డులో ఇసుక నిల్వలు నిండుకుంటున్నాయి. 7,500 మెట్రిక్ టన్నుల మాత్రమే నిల్వ ఉంది. వినియోగదారులకు రోజుకు సుమారు వెయ్యి టన్నులు సరఫరా చేస్తున్నారు. ప్రత్యామ్నాయ ఇసుక నిల్వలపై మైనింగ్ శాఖ దృష్టి సారించాల్సి ఉంది. ఇతర జిల్లాలో ఉన్న ఇసుక నిల్వలకు ఆన్‌లైన్‌లో బుకింగ్‌కు అవకాశం కల్పించాలని వినియోగదారులు కోరుతున్నారు.

కొమ్మమూరు కాలువలో బీటెక్ విద్యార్థి గల్లంతు

తెనాలి రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కొమ్ముమూరు కాలువలో బీటెక్ విద్యార్థి గల్లంతైన ఘటన శనివారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు కేవీసీ కాలనీకి చెందిన గుంజి రవీంద్ర (20) ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మండలంలోని సంగంజాగర్లమూడి శ్రీ సంగమేశ్వర స్వామి వారి ఆలయానికి శనివారం తన ఐదుగురు స్నేహితులతో కలిసి వెళ్లాడు. ఈ క్రమంలో ఆలయం సమీపంలో ప్రవహిస్తున్న కొమ్ముమూరు కాలువలోకి దిగి ప్రమాదవశాస్తూ అందులోపడిపోయాడు. అతడి ఆచూకి కోసం స్నేహితులు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి వచ్చి ఫైర్ అధి కారులతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లి కాలువ వద్దకు వచ్చి కుమారుడి కోసం రోదిస్తున్న తీరు చూపరులను కంటతడిపెట్టించింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌కుమార్ పేర్కొన్నారు.

రూ.1.30 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

● 'పల్లె పండుగ'తో అభివృద్ధి ● అన్నవరం, హనుమాన్‌పాలెం, తూములూరు, సిరిపురం, అత్తోటలో మంత్రి నాదెండ్ల శంకుస్థాపన



సిరిపురంలో శంకుస్థాపన చేస్తున్న మంత్రి మనోహర్

కొల్లిపర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆలోచనలతో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో 13 వేల 362 పంచాయతీల్లో 4 వేల 500 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేపట్టడం చాలా గొప్ప విషయమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండల పరిధిలోని అన్నవరం, హనుమాన్‌పాలెం, తూములూరు, సిరిపురం, అత్తోట గ్రామాల్లో శనివారం రూ.కోటి 30లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పల్లెల్లో అభివృద్ధి బాటలు వేసిందని, దశల వారీగా గ్రామాలను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. కొల్లిపర మండలంలోని గ్రామాల్లో రూ 2. కోట్ల 50లక్షలతో సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో ప్రజలకు ఎక్కువగా ఉపయోగపడే విధంగా రోడ్లు, డ్రైయిన్‌లు, రక్షిత మంచి నీటిసౌకర్యం కల్పించే విధంగా మంచి ప్రణాళికతో ముందుకు వెళతున్నామన్నారు. ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి ఏర్పాటుకు తన వంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ఇక్కడే ఉపాధి కల్పించే విధంగా తగిన చర్యలు చేపడతామన్నారు. యువతకు ఎక్కువగా ఉద్యోగాలు ఇచ్చేలా పారిశ్రామికవేత్తలకు స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. మన సంస్కృతిని, పల్లెటూరుల వాతావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కొల్లిపర మండలంలోని రైతులు వాణిజ్య పంటలు ఎక్కువగా పండిస్తారని, రాబోయే రోజుల్లో అగ్రికల్చర్ హబ్‌గా ఏర్పాటుకు తగిన కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, పీఆర్ఏఈ ఎ.సాంబిరెడ్డి, కూటమి నాయకులు ఎ.నారాయణరెడ్డి, ఎం.వెంకయ్య, పి.సుబ్బారావు, పి.వెంకటేశ్వరరావు, డి.నరసయ్య, వై.వెంకయ్యనాయుడు, డి.ఏడుకొండలు, వై.పూర్ణచంద్రరావు, ఏటీఎం శ్రీను, వై.వెంకటరమణ పాల్గొన్నారు.



సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

గ్రామాల సమగ్రాభివృద్ధికి 'పల్లె పండుగ'

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నకరికల్లు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం పల్లె పండుగ నిర్వ హిస్తోందని ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు అన్నారు. అడ్డ రోడ్డు, నకరికల్లు గ్రామాల్లోని సీసీ రోడ్లకు శనివారం ఆయన భూమి పూజ చేశారు. అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఒక దివ్యాంగుడు, ఇద్దరు మహిళలు తమ పింఛన్ల కోసం ఎంపీకీ అభ్యర్థించగా వాటిని మంజూరు చేసే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జీ కాశయ్యను ఆదేశించారు. నకరికల్లులో ఎంపీడీవో కార్యాలయం వద్ద నుంచి ఇందిరమ్మ కాలనీ వరకు గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరగా అందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ప్రజలకు తెలిపారు. రైతుల కోసం తీసుక వచ్చిన ఇండో ఇజ్రాయల్ ప్రాజెక్టును సెంట్రాఫ్ ఎక్స్‌లెన్స్ పనులను ప్రారంభించే విధంగా తగు చర్యలు తీసుకుంటా మన్నారు. నడికూడి, శ్రీ కాళహస్తి రైల్వే లైన్ మార్గంలో ప్యాసింజర్ రైళ్ళు నడిపేలా చూడాలని కోరడంతో స బంధిత అధికారులతో మాట్లాడతానని ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో ఏఈలు సురేష్‌లు, తస్లిమా, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.శౌరయ్య, ఎంపీపీ ఎం.అను రాధ, జెడ్పీటీసీ హరీష్, ఎంపీడీవో జీ కాశయ్య, తహసీల్దార్ కే పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల సమస్యల పరిష్కారానికి లోకేశ్ చొరవ చూపాలి


● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

తాడేపల్లి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏసీసీ సిమెంటు కార్మికుల సమస్యల పరిష్కారానికి మంత్రి నారా లోకేశ్ చొరవ చూపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె .రామకృష్ణ అన్నారు. శనివారం సాయంత్రం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో సిమెంటు కంపెనీ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1993లో ఏసీసీ యాజమాన్యం, సిమెంటు ఫ్యాక్టరీని అక్రమలాకౌట్ చేసిందని చెప్పారు. గత 40 ఏళ్లగా నష్టపరిహారం చెల్లించాలంటూ కార్మికులు ఆందోళన చేస్తున్నా ఫ్యాక్టరీ యాజమాన్యం గానీ, ప్రభుత్వం కానీ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం కూడా కార్మికులకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిమెంటు ఫ్యాక్టరీ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ఇన్నేళ్లగా ప్రభుత్వాలు మారినా కార్మికుల సమస్యల పరిష్కారం కాలేదన్నారు. సీఎం చంద్రబాబును, మంత్రి లోకేశ్‌ను కలిసి కార్మికుల సమస్యను వివరిస్తామని పరిష్కరించే విధంగా ఒత్తిడి తీసుకొస్తామని, కార్మికులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని రామకృష్ణ హామీ ఇచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా నేతలు జంగాల అజయ్‌కుమార్, చిన్ని తిరుపతయ్య, కంచర్ల కాశయ్య, తుడిమిల్ల వెంకటయ్య, సీపీఎం నేతలు బూరుగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, సిమెంటు ఫ్యాక్టరీ యూనియన్ నేతలు కూరపాటి స్టీవెన్, కె ఆదినారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

ఏపీ లా సెట్ స్పెషల్ కేటగిరీల అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

పెదకాకాని, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని న్యాయ శాస్త్ర కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ లా సెట్-2024 సంబంధించి ప్రవేశాలలో భాగంగా స్పెషల్ కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శనివారం పూర్తయింది. ఆన్‌లైన్ ఆన్లైన్ హెల్ప్ లైన్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. బ్రహ్మాజీ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఎస్ సీ సీ అభ్యర్థులు 126 మంది, సీఏపీ అభ్యర్థులు 12 మంది, పీహెచ్ అభ్యర్థులు 37 మంది, స్పోర్ట్స్ అభ్యర్థులు 40 మంది హాజరయ్యారని తెలి పారు. సర్టిఫికెట్ల పరిశీలనను ఏపీ లా సెట్ 2024 అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ బి. సత్యనారాయణ పర్యవేక్షించారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి



హనుమంతరావు

అచ్చంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన గడ్డం హనుమంతరావు(70) శనివారం మధ్యాహ్నం పిడుగుపడి మృతి చెందాడు. రుద్రవరం, ఆర్‌కేజీ పాలెం గ్రామాల మధ్య పశువులను మేపుతున్నాడు. ఈ క్రమంలో భారీ వర్షం కురవడం, పిడుగు పడటంతో హనుమంతరావు తలకు, శరీరం పై తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం గమనించిన సమీపంలోని వారు హనుమంతరావు బంధువులకు సమాచారం తెలియజేశారు. మృతదేహాన్ని రుద్రవరానికి తరలించారు. మృతుడి భార్య సీతా రావమ్మ గతంలో మృతి చెందారు. ఒక కుమా రుడు, కుమార్తె ఉన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

గుంటూరు సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమరావతి డ్రోన్ సమ్మిట్-2024ను నిర్వహించనుంది. దీని ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు , రాష్ట్ర మంత్రులు మంగళగిరి సీకే కన్వె న్షన్‌కు రానున్న నేపథ్యంలో అక్కడి ఏర్పాట్లను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శనివారం పరిశీలించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో చర్చించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని డ్రోన్ కార్పొరేషన్ ఎండీ దినేష్ కుమార్ సూచించారు. ఈ కార్య క్రమంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్, ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండి కె.దినేష్‌కుమార్,జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, అసిస్టెంట్ కలెక్టర్ పోవర్ స్వప్నిల్ జగన్నాథ్, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా పాల్గొన్నారు.

రోగులకు వైద్యం చేయండి.. రాజకీయాలు కాదు

● డీసీహెచ్ఎస్ ఎంఏ మజీదా బేగం

● ఈపూరు వైద్యాధికారి ఆత్మహత్యాయత్నంపై విచారణ



వైద్యులను విచారిస్తున్న డీసీహెచ్ఎస్‌ఓ మజీదా బేగం

ఈపూరు,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): రోగులకు మానవత్వంతో వైద్యం చేయాలి కాని ఆసుపత్రిలో రాజకీయాలు చేయకూడదని గుంటూరు జిల్లా డీసీహెచ్ఎస్ ఎంఏ మజీదా బేగం అన్నారు. ఈపూరు సామాజిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి కమలాకరరావు ఆత్మహత్యా యత్నం చేయడం, అందుకు ఆసుపత్రి సిబ్బందే కారణమని ఆయన చెప్పడంతో శనివారం విచారణ చేపట్టారు. ఆసుపత్రిలో పని చేస్తున్న వైద్యులను,సిబ్బందిని డీసీ హెచ్ఎస్ విచారించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. ముప్పై పడకల ఆసుపత్రి సిబ్బంది 38 మంది ఉం డగా, అందులో 8 మంది వైద్యులు ఉన్నారని, రోగులకు వైద్య సేవలు అందించాల్సిందిపోయి వాళ్లందరూ రాజకీయాలు చేస్తుండడం బాధాకరమని అన్నారు. ఆసు పత్రి ఇంచార్జికి రికార్డు వర్క్ చాలా ఉంటుందని, ఇన్‌చార్జిపై ఒత్తిడి పెంచడం మంచి పద్ధతి కాదని అన్నారు. టెక్నాలజీ పెరిగినప్పటికి దానికి అనుగుణంగా వారు పని చేయడంలేదని తెలుస్తోందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వా లని, ఆ అభిప్రాయాలను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. ఆసుపత్రికి కొత్త ఇన్‌చార్జిని నియమిస్తామని చెప్పారు. ముందుగా ఆసుపత్రిలోని అటెండెన్స్ రిజిస్టర్‌ను ఆమె పరిశీలించారు. 28 మంది విధులలో ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆసుపత్రిలోని బెడ్స్, కాన్పుల గది, ఆపరేషన్ థియేటర్,ఎక్స్‌రే ప్లాంట్, రక్తపరీక్షల గదిని, ఆక్సిజన్ సిలిండర్లను పరిశీలించారు. అయితే, బెడ్స్ అన్నీ ఖాళీగా ఉండడం చూసి ఆమె ఆశ్చర్యపోయారు. ఆసుపత్రిలో ఇంతమంది వైద్యులు,సిబ్బంది ఉన్నారు. రోగులు లేకపోవడం చాలా బాధగా ఉందన్నారు. నెలకు ఎన్ని కాన్పులు అవుతున్నాయని స్టాఫ్ నర్సును అడగగా ఒక్కటేనని సమాధానమిచ్చారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నాలుగు మాత్రమే చేసినట్లు తెలిపారు. ఆసుపత్రిలో రోగులు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన డీసీహెచ్ఎస్‌ఓ అందరికి మెమోలు ఇచ్చేందుకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్‌లో కేఎల్‌యూ విద్యార్థిని సాదియాకు 4 బంగారు పతకాలు



సాదియాను అభినందిస్తున్న వీసీ సారధివర్మ తదితరులు

తాడేపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4 నుండి 13వరకు సన్ సిటి సౌత్ ఆఫ్రికా దేశంలో జరిగిన కామన్ వెల్త్ పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్ జూని యర్ పోటీలలో కెఎల్‌యూ విద్యార్థిని షేక్ సాదియా అల్మాస్ నాలుగు బంగారు పత కాలు కైవసం చేసుకుని రికార్డు సృష్టిం చిందని వీసీ జి.సారధివర్మ తెలిపారు. స్కాట్ 185 కిలోల బరువు పోటీలలో బంగారు పతకం, బెంచ్ ప్రెస్ 95 కేజీల బరువులో బంగారు పతకం, డెడ్ లిఫ్ట్ 180 కేజీల బరువులో బంగారు పతకం, ఓవరాల్ 460 కిలోల విభాగంలో మరో బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువు తున్నసాదియాను వర్సిటీలో శనివారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు. కార్యక్రమంలో ప్రోవీసీ డాక్టర్ ప్రసాద్, వెంకటరామ్, రాజశేఖరరావు, రిజిస్ట్రార్ సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్, సాదియా తండ్రి షేక్ సంధాని పాల్గొన్నారు.



రాష్ట్ర జట్టుకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం ఖాసిం తదితరులు

అండర్-14,17 చెస్ రాష్ట్ర జట్లు ఎంపిక

గుంటూరు(విద్య), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి గుంటూరు జిల్లాఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వబాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెస్ పోటీల్లో రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు. అండర్-14 అండర్-17 బాల బాలికల జిల్లా స్థాయి చదరంగం పోటీలు శుక్రవారం ముగిశాయని, అనంతరం రాష్ట్ర జట్టును ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహమ్మద్ ఖాసిం స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి ఎం.రవి వెల్లడించారు.

అండర్-17 బాలుర విభాగంలో ..

అర్జున్ ఆదిత్య రవి, (గుంటూరు), పీఎస్‌వీ యశ్వంత్ రాజ్ కుమార్ (గుంటూరు),ఏ చంద్ర మహేష్(మాచర్ల), ఐ.మోహిత్ వెంకట శ్రీ సాయి (మాచర్ల) ఆర్ భార్గవ్ శ్రీనివాస నాయక్ (మాచర్ల)

అండర్-17 బాలికల విభాగంలో..

ఎ.సాయి దివ్య (గుంటూరు), ఎం.నాగసరియా (అమరావతి),పి.దివ్య (కొలకలూరు), షేక్ నజీరా (ఆత్మకూరు), ఎం.మైథిలి (అమరావతి) తదితరులు ఎంపికయ్యారు.

అండర్- 14 బాలుర విభాగంలో..

కె.శాన్వి మౌజీ (మాచర్ల), ఎహెచ్ సూర్యనారాయణ(గుంటూరు), బి.ప్రజిత్ (గుంటూరు), ఆర్.లోకేష్ (పిడుగురాళ్ల) వై.యాజ్ఞస్ (గుంటూరు) ఎంపికయ్యారు.

అండర్-14 బాలికల విభాగంలో..

ఎం.తేజ అనూష (గుంటూరు), సిహెచ్ మేరీ అక్షయ (తెనాలి), బి.భావన (మిరియాల), సిహెచ్ లక్ష్మీచేతన (గుంటూరు) ఎం.మనస్వి, (గుంటూరు).

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	135, 145,155
చికెన్ విత్ స్కిన్	260.00
చికెన్ స్కిన్ లెస్	270.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌ను శనివారం రాత్రి గురజాల పదో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారిణి ప్రియదర్శిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్‌డబ్ల్యూ సుజాతకుమారికి సూచించారు. కార్యక్రమంలో వార్డెన్లు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. - గురజాలటౌన్



మాట్లాడుతున్న కొమ్మాలపాటి శ్రీధర్, వేదికపై ఎమ్మెల్యే ప్రవీణ్, ఆలపాటి

ఆరోగ్య కేంద్రంలో అవినీతి

ఆయనో ప్రభుత్వ వైద్యాధికారి.. ఆరోగ్య కేంద్రానికి వచ్చే నిరుపేద రోగులకు మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వం నిధులు అందిస్తే.. ఆ నిధులను తన సొంత అవసరాలకు వినియోగించుకున్న ప్రభుద్ధుడు.. వైద్య సేవలైనా సక్రమంగా అందిస్తాడా అంటే అదీ లేదు.. డబ్బులకు కక్కుర్తి పడి ఇక్కడకు వచ్చే రోగులను తన ఆధీనంలోని ప్రైవేటు వైద్యశాలకు రిఫర్ చేస్తుంటాడు.. ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టుకోలేడు అనుకున్నాడో ఏమో.. వైద్యశాలలో ఫర్నీచర్ కొరకు ప్రభుత్వం అందించిన నగదుతో తన ఇంట్లో సామాగ్రిని సమకూర్చుకున్నాడు.. ఎంపీపీ యేచూరి సునీతాశంకర్ తనిఖీల్లో ఈయన గారి చేష్టలన్నీ బట్టబయలు అయ్యాయి..



- ప్రభుత్వ నిధులు సొంత అవసరాలకు..
- బిల్లులున్నాయి.. సామగ్రియే లేదు
- వైద్యాధికారే ప్రధాన సూత్రధారి
- ఎంపీపీ సునీతా శంకర్ తనిఖీలో విషయం బట్టబయలు

దుర్గి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన దుర్గిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను శుక్రవారం ఎంపీపీ యేచూరి సునీతాశంకర్ తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఆరోగ్య కేంద్రంలో ఫర్నీచర్ కోసం ప్రభుత్వం మంజూరు చేసిన నగదుకు సంబంధించి బిల్లులైతే ఉన్నాయి గానీ ఫర్నీచర్ మాత్రం కనపడలేదు. దీనిపై వైద్యాధికారి పెద సైదులును ఎంపీపీ ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెప్పారు. దీనిపై ఆరాతీయగా ఆరోగ్య కేంద్రంలో ఫర్నీచర్ కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 1.08 లక్షలను వైద్యాధికారి పెద సైదులు తన సొంతానికి వినియోగించుకున్నట్లు తెలిసింది. అలాగే ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులను వైద్యాధికారి పెద సైదులు, సూపర్‌వైజర్ రెహ్మాన్ కుమ్మక్కై ఇతరుల పేరుతో ఏర్పాటు చేసుకున్న ప్రైవేటు వైద్యశాల రిఫర్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపించాయి. ఆరోగ్య కేంద్రంలో వాల్‌పూల్ ఫ్రిజ్‌ను కొనుగోలు చేసినట్లు బిల్లు చూపించి పాత సాంశంగ్ ఫ్రిజ్‌ను ఏర్పాటు చేశారు. నూతన ఫ్రిజ్‌ను డాక్టర్ పెద సైదులు అతని గృహానికి తరలించినట్లు తేటతెల్లమైంది. ప్రతి మూడు నెలలకోసారి కమిటి సభ్యులతో సమావేశం ఏర్పాటుచేయాల్సి ఉండగా సంవత్సరం గడుస్తున్నా



దుర్గిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ పెద సైదులను ప్రశ్నిస్తున్న కూటమి నేతలు

ఒక్కసారి కూడా సమావేశం ఏర్పాటు చేయకుండా వైద్యాధికారి పెద సైదులు నియంతలా వ్యవహరిస్తున్నారని తెలుసుకున్నారు. అలాగే సూపర్ వైజర్ రెహ్మాన్ విధుల్లో లేనప్పటికీ రిజిష్టర్ పట్టికలో విధులు నిర్వహిస్తున్నట్లు సంతకం ఉండడం గుర్తించారు.

ఆరోగ్య కేంద్రంలో ఇన్వర్టర్ లేకపోవడంతో కరెంట్ పోతే అంధకారమవుతోంది. గర్భిణీలకు, రోగులకు సెల్ ఫోన్ వెలుతురులో వైద్యం అందించాల్సిన దుస్థితి నెలకొంది. ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వసతుల కోసం ప్రభుత్వం అందించిన నగదును సొంత అవసరాలకు వినియోగించిన వైద్యాధికారి పెద సైదులుపై రోగులు, ప్రజలు మండిపడుతున్నారు. ఈ తనిఖీలో ఎంపీపీ సునీతాశంకర్‌తోపాటు కూటమి నేతలు లింగా రమేష్, తేటకూర శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన పాత ఫ్రిజ్

గ్రామ సభలో 27 అర్జీలు

సత్తెనపల్లి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భీమవరం గ్రామంలో శనివారం నిర్వహించిన గ్రామ సభలో రైతుల వద్ద నుంచి 27 దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి తెలిపారు. గ్రామంలో జరిగిన రీ సర్వేలో ఎక్కువగా భూమి విస్తీర్ణం తక్కువగా చూపారని, దానిని పరిష్కరించాలని కోరుతూ రైతులు అర్జీలు అందించినట్టు ఆయన తెలిపారు. గ్రామ సభలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ సర్వే విజయ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పెదకూరపాడు : మండలంలోని హుస్సేన్ నగరంలో శనివారం రెవెన్యూ గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది రైతులు రీ సర్వేలో సమస్యలతో కూడిన వినతి పత్రాలను అందజేసినట్లు తహసీల్దార్ మీసాల డానియేలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నిర్మల కృష్ణ, వీఆర్‌వో షేక్ హుస్సేన్, టీడీపీ నాయకులు నెల్లూరి మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 1,18,890 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు వస్తుంది. ప్రాజెక్టు వద్ద 1,36,577 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. వీటిలో 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారాను, మిగిలినవి ఐదు గేట్ల ద్వారా కృష్ణ నదికి విడుదల అవుతున్నాయి.

సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన

రత్నమేరి సంతోష్

కారంపూడి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనుపరాజుపల్లి సర్పంచ్‌గా తగరం రత్నమేరి సంతోష్ శనివారం బాధ్యతలు చేపట్టారు. పంచాయతీ కార్యాలయంలో కూటమి నేతల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దంపతులను కూటమి నేతలు దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పంగులూరి అంజయ్య, గోళ్ల సురేష్ యాదవ్, మునుగోటి సత్యం, చప్పిడి రాము, మస్తాన్ జాని తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

రెంటచింతల,అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్ల ఉంటూ విద్యనభ్యసిస్తున్న బాల బాలికలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శీతాకాలంలో తగు జాగ్రత్తలు పాటించాలని బీసీ బాలుర, బాలికల హాస్టల్ వార్డెన్ సుశీల విద్యార్థులకు సూచించారు. శనివారం 175 మంది బాలికలకు, 74 మంది బాలురకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహాయకులు అంజి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో మాక్ పోలింగ్

నకరికల్లు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : దేచవరం మోడల్ స్కూల్లో శనివారం విద్యార్థులతో మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమగ్ర శిక్షలో భాగంగా 'దేశ్ అప్నాయాన్ సహయోగ్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ వెళాంగిని మేరీ, ఉపాధ్యాయులు తెలిపారు. ఎన్నికల పోలింగ్ నిర్వాహణ, ఓటు హక్కు వినియోగించుకొనే విధానం పై ప్రయోగాత్మకంగా తెలియ జేశారు.

26 నుంచి సభ్యత్వ నమోదు

సత్తెనపల్లి, అక్టోబరు 19 : ఈనెల 26వ తేదీ నుంచి నియోజక వర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చురుగ్గా చేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సభ్యత్వ రుసుం రూ.100 ఉంటుందన్నారు. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు ఇన్సూరెన్స్ రెండు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతున్నట్టు ఆయన పేర్కొన్నారు.

అన్నప్రసాదం పంపిణీ

కారంపూడి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కారంపూడిలోని గాంధీ బొమ్మ సెంటర్లో గల ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద శనివారం వాసవీ సేవా అన్న ప్రసాద కమిటి ఆధ్వర్యాన 200 మంది పేదలకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. సూరె సుబ్రహ్మణ్యం గుప్త జ్ఞాపకార్థం ఉప సర్పంచ్ సూరె అంకారావు, అతని కుటుంబసభ్యులు ఈ కార్యక్రమం నిర్వహించారు.



నిండుగా ప్రవహిస్తున్న తంగెడ మేజర్ కాల్వ

మేజర్ కాల్వలకు

సాగర్ జలాలు విడుదల

దాచేపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు చేసిన కాల్వలకు సాగర్ నుంచి సాగునీరు విడుదల చేయడంతో కాల్వకు దిగువన వున్న భూములకు సాగునీరు చేరుతుంది. తంగెడ మేజర్ పరిధిలో పెదగార్లపాడు, చినగార్లపాడు, వీరాపురం, శాంతినగర్, కేశానుపల్లి, ముత్యాలంపాడు, తంగెడ గ్రామాలకు చెందిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రైతులతో కలిసి చేపట్టి అభివృద్ధి పనులతో కాల్వల కష్టాలు తొలగిపోయాయని రైతులు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోయినా యరపతినేని చొరవ తీసుకొని కాల్వల మరమ్మతు పనులు పూర్తిచేయించారని కొనియాడుతున్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

- ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు
- గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సత్తెనపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పల్లె పండుగ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీసీ డ్రెయిన్‌లు, రహదారులు, ప్రహరీల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంపీ లావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పల్లెపండుగ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. వైసీపీ ఐదేళ్ల విధ్వంస పాలనలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధికి బాటలు వేసేందుకు కృషి చేస్తుందన్నారు.ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. పేదల, రైతుల మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మేడికొండూరు మండలం పేరేచర్ల నుంచి రాజుపాలెం మండలం కొండమోడు వరకు 4 లైన్ల జాతీయ రహదారి పనులు త్వరలో ప్రారంభమవుతాయని ఎంపీ తెలిపారు.

బృగుబండలో రూ 10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి కందుల వారిపాలెంలో రూ.15 లక్షల వ్యయంతో సీసీ డ్రెయిన్‌లు, రోడ్ల నిర్మాణానికి, గోగులపాడు గ్రామంలో రూ.10లక్షల వ్యయంతో డబ్ల్యూబీఎం రోడ్డు నిర్మణానికి, రెంటపాళ్ళల్లో రూ.9లక్షల వ్యయంతో



కంకణాలపల్లిలో పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు

రెండు సీసీ డ్రెయిన్‌ల నిర్మాణానికి, కంకణాలపల్లిలో రూ.12.05లక్షల వ్యయంతో రెండు ప్రహరీల నిర్మాణాలకు, వెన్నాదేవిలో రూ.14.5 లక్షలతో రెండు ప్రహరీల నిర్మాణానికి, పాకాలపాడులో రూ 4 లక్షల వ్యయంతో సీసీ డ్రెయిన్‌ల నిర్మాణానికి ఆయన శంకు స్థాపనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ రాజ్ డీఈ శేఖర్ బాబు, ఏఈ రామ్మోహన్‌సింగ్, టీడీపీ నేతలు ఆళ్ళ అమరేశ్వరరావు, మక్కపాటి రామచంద్రరరావు, భీమినేని వందనాదేవి, ఆళ్ళసాంబయ్య, అన్నదాసు వెంకట్రామయ్య, మల్లారెడ్డి, లగడపాటి గజానన, పచ్చా సుధీర్, శ్రీనివాసరావు, అన్నదాసు వెంకట్రా మయ్య, కొఠారు సత్యనారాయణ, ఏకుల రాజశేఖర్, పూర్ణయ్య, నన్నేసా, కొఠారు ప్రసాదు, చౌటశ్రీను, చెన్నమల్లు, మాజీ ఎంపీటీసీ సోలానంబీ కూటమి నేతలు పాల్గొన్నారు.

వ్యాపారవర్గాలకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి

మాచర్లటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యాపార వర్గాలకు కూటమి ప్రభుత్వం అన్నిరకాలుగా అండగా ఉంటూ, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునిస్తుందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని డాల్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో మాచర్ల, దుర్గి డాల్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించి వారి మన్ననలు పొందేలా వ్యాపారులు ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చిన్న మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తుందన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి నూతన కార్యవర్గ సభ్యులను దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, కేశవరెడ్డి, సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యమే కూటమి ధ్యేయం

దుర్గి : గ్రామ స్వరాజ్యమే కూటమి ధ్యేయమని మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన దుర్గితోపాటు మండలంలోని అడిగొప్పుల గ్రామంలో నూతన సీసీ రోడ్ల నిర్మాణాలకు ఆయన భూమిపూజ నిర్వహించి మాట్లాడారు. దుర్గిలో రూ. 30 లక్షలు, అడిగొప్పులలో రూ. 25 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యేచూరి సునీతా శంకర్, జానకి రామయ్య, తేటకూర శ్రీనివాసరావు, పులి హరి, లింగా రమేష్, కటకం రామారావు, సింగు నాగేశ్వరరావు, జక్కా కొండలు, బీమా అమరయ్య, మాగులూరి నారయ్య, మేకల దాసు, యాగంటి నరేష్, ఉన్నం మహేష్, సూరె కృష్ణ, రుద్రాల రవి, మేకల రామారావు, దిగుమర్తి సుబ్బారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అదనపు హంగులు

- ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో శ్రీలత

సత్తెనపల్లి, అక్టోబరు 19 : సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలోని సత్తెనపల్లిమండలం భట్లూరు- 2, ముప్పాళ్ళ మండలం మాదల-6, తొండపి 1,2, నకరికల్లు మండలం చాగల్లు 1, చేజర్ల 3, త్రిపురాపురం అంగన్ వాడీ కేంద్రాలు సిమిలేటింగ్ అడ్వాన్స్ నాలెడ్జ్ ఫర్ సస్టయినబుల్ హెల్త్ మేనేజ్ కేంద్రాలుగా ఎంపికైనట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో శ్రీలత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఇటీవల నియోజకవర్గంలోని కొన్ని అంగన్‌వాడీకేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వ నిధులతో కొత్త సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కుర్చీలు, బల్లలు, ఫ్యాన్‌లు, టీవీ, రక్షిత తాగునీటి పరికరాలు, బొమ్మలు అందజేస్తారని తెలిపారు. పోషణవాటిక పేరుతో కేంద్రాల ఆవరణలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కలు పెంచుతామన్నారు. ఆ పథకం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా కేంద్రాలు పని చేస్తాయని తెలిపారు.

పేదల అభ్యున్నతికి శ్రమించిన అచ్చిరెడ్డి

దాచేపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సీపీఐ నేత వేముల అచ్చిరెడ్డి పేదల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేశారని సీపీఐ గురజాల నియోజకవర్గ నేత మందపాటి రమణారెడ్డి తెలిపారు. శనివారం దాచేపల్లి మండలం రామాపురం గ్రామంలో వేముల అచ్చిరెడ్డి 33వ వర్ధంతిని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన కార్మికనేత వేముల వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో పాఠశాలలు, విద్యుత్ లైన్ల ఏర్పాటుకు అచ్చిరెడ్డి కృషిచేశారన్నారు. మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ వేముల వినోద్‌రెడ్డి అచ్చిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొమెర వెంకటరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేముల వీరరాఘవరెడ్డి, తంగెళ్ల స్వామి, ఆకూరి వీరశేఖరరెడ్డి, వెంకటేశ్వర్లు, కాశయ్య, వెంకటరెడ్డి, పుల్లయ్య, నాగేశ్వరరావు, సైదులు, పెదసైదులు, రామారావు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



అచ్చిరెడ్డి వర్ధంతి సభలో మాట్లాడుతున్న మందపాటి రమణారెడ్డి తదితరులు

ఉపాధి కోర్సుల్లో

మహిళలకు ఉచిత శిక్షణ

నకరికల్లు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలనుకొనే గ్రామీణ మహిళలకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ డైరెక్టర్ జీబీ కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా జర్దోసి మగ్గం వర్క్స్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ కోర్సును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నెల రోజుల ఈ శిక్షణలో ఉండేవారికి ఉచిత హాస్టల్, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. 19నుంచి 45 సంవత్సరాల మధ్యవయస్సు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వివరాలకు 9700687696, 8127397953, 9949930155 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

గుత్తికొండ మెయిన్ కెనాల్‌లో

యువకుడు గల్లంతు

పిడుగురాళ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గుత్తికొండ గ్రామానికి చెందిన గుదె శ్రీనివాసరావు (35) శనివారం మధ్యాహ్నం గుత్తికొండ మెయిన్ కెనాల్‌లో స్నానానికి దిగి గల్లంతైనట్లు స్థానికులు గుర్తించారు. అయ్యప్ప మాల ధరించిన శ్రీనివాసరావు గుత్తికొండ బ్రిడ్జి వద్ద స్నానానికి దిగాడు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో ఆ ప్రవాహంలో కొట్టుకుపోయినట్లు స్థానికులు తెలిపారు. శ్రీనివాసరావు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.



కస్తూర్బా బాలికల పాఠశాలకు కుట్టు మిషన్, కుర్చీలను అందజేస్తున్న స్నేహ హస్తాల ఫౌండేషన్ సభ్యులు

స్నేహహస్తాల ఫౌండేషన్

సేవలు మరువ లేనివి

బెల్లంకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్నేహ హస్తాల ఫౌండేషన్ సేవలు మరువ లేనివని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ప్రిన్సిపాల్ ఉషారాణి అన్నారు. శనివారం బెల్లంకొండ అడ్డ రోడ్డు వద్ద గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి రూ 30వేలు విలువచేసే కుర్చీలను, రూ.10 వేలు విలువచేసే ఒక కుట్టు మిషన్‌ను ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. ఇచ్చిన వస్తువులను సద్వినియోగం చేసుకొని పిల్లలకు కొంత కుట్టు శిక్షణ ఇచ్చేందుకు సిద్దంగా ఉన్నామని పేర్కొన్నారు. అనంతరం స్నేహ హస్తాల ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ కరిముల్లా వస్తువులను పాఠశాలకు అందించటం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులకు

మదర్‌థెరిస్సా సేవా పురస్కారం

క్రోసూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు మండల ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్, అచ్చంపేట మండల ఆరోగ్య విస్తరణ అధికారి పోసిపోగు వెంకటరావులు హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రదానం చేసే మదర్ థెరిస్సా సేవా పురస్కారానికి ఎంపికైనట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు కంచర్ల బుల్లిబాబు తెలియ జేశారు. ఆదివారం సత్తెనపల్లి ఐఏఎం హాల్‌లో జరిగే కార్యక్రమంలో వారికి ఈ పురస్కారాలు అందజేస్తామని ఆయన తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగాలను సమర్థవంతంగా నిర్వహించటంతో పాటు వివిధ రంగాల్లో వీరి సేవలను గుర్తించి ఈ పురస్కారాలకు ఎంపిక చేసినట్లు తెలియ జేశారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదులో

నియోజకవర్గం అగ్రస్థానంలో ఉండాలి

- పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్
- ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అధ్యక్షతన టీడీపీ శ్రేణులతో సమావేశం
- హాజరైన కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్

అమరావతి, అక్టోబరు 19: త్వరలో జరుగనున్న ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి ఓటు నమోదులో పెదకూరపాడు నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలపాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. శనివారం స్థానిక జేబీ గార్డెన్స్‌లో స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అధ్యక్షతన నియోజకవర్గ కూటమి నేతల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిలుగా కొమ్మాలపాటి శ్రీధర్‌తో పాటు ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కొమ్మాలపాటి మాట్లాడుతూ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కూటమి ఎమ్మెల్సీ నేతగా అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈనెల 26 నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం అవుతుందని, ప్రతి నలుగురిలో ఒకరు సభ్యత్వం పొందేలా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 60 వేల పార్టీ సభ్యత్వం, 10 వేలకు పైగా ఎమ్మెల్సీ ఓటరు నమోదు జరగాలని పార్టీ శ్రేణులకు సూచించారు. రాజేంద్రప్రసాద్ గెలుపునకు గట్టిగా కృషిచేయాలని కూటమి నేతలను కోరారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ శాసన మండలిలో ప్రజాగళం విప్పడానికి సీఎం చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, బీజేపీ అధ్యక్షురాలు పురంధరేశ్వరి తనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి పార్టీల తరఫున ప్రకటించారన్నారు. రానున్న రోజులలో రాష్ట్రంలో వైసీపీ కనుమరుగయ్యేలా కూటమి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నియేజకవర్గంలోని ఐదు మండలాల అధ్యక్షులు యం విష్ణు, అర్తిమళ్ల రమేష్, నందిగం ఆశీర్వాదం, భాషా, వెంకటేశ్వర్లు, టీడీపీ రాష్ట్ర నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు, జనసేన నియోజకవర్గ నేత రామకృష్ణ, సంఘం డైయిరీ మాజీ ఛైర్మన్ కే.రాజన్‌బాబు, భాష్యం నరసయ్య, ఎం. గంగాధర్ నియేజకవర్గ టీడీపీ నేతలు పాల్గొన్నారు.

'పల్లెపండుగ'తో గ్రామాలకు మహర్దశ

- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల,అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లెపండుగ కార్యక్రమం ద్వారా గ్రామాలు సర్వతోముఖాభివృద్ధిచెందుతాయని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం రెంటచింతలలోని మాణ్యంలోని అల్ఫోర్స్ స్కూల్ వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ముందుగా ఆంజనేయస్వామి ఆలయంలో మాజీ ఎంపీటీసీ శివయ్య మొక్కుబడి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబ్బిరెడ్డి, శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు రాజారెడ్డి, అధికా రులు, టీడీపీ నేతలు పాల్గొ న్నారు. అలాగే పాలువాయిగేట్ గ్రామంలో రూ.10 లక్షల విలువచేసే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో అర్జున్, నరేంద్ర, మాజీ సర్పంచ్‌లు సాంబయ్య, బెల్లంకొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: కరాలపాడు గ్రామంలో సైడు డ్రైన్స్, సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎంపీడీవో రామచంద్రరావు శంకుస్థాపనచేశారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్డీ దయాసాగర్, పంచాయతీ కార్యదర్శి రవికాంత్ పాల్గొన్నారు.

మాచవరం: మండలంలోని మోర్జంపాడులో రూ.30 లక్షలు, సింగరాయపాలెం తండా గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేపట్టారు. కార్యక్రమాల్లో అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

అచ్చంపేట : అచ్చంపేటలో గ్రామంలో గోకుల్ షెడ్డు, సిమెంట్ సైడు కాలువల నిర్మాణానికి శంకు స్థాపనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, ఎనిగండ్ల కోటయ్య, పాటిబండ్ల బాపిరాజు, ఎస్‌కే కాసుల, సర్పంచ్ షేక్ జానీ, సాంబశివుడు, కోట చంటి తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం :మండలంలోని బ్రాహ్మణపల్లి, దేవరంపాడు గ్రామాలలో రూ.4.60 లక్షలతో నిర్మించనున్న గోకులం షెడ్ల నిర్మాణాలకు, రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణాలకు టీడీపీ నేతలు, అధికారులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, ఎంపీడీవో జీవీ సత్యానారాయణ, తహశీల్దార్ దుర్గేశ్వరరావు, ఈవోపీఆర్డీ ముక్కంటి పాల్గొన్నారు.

స్వర్ణకారులను గుర్తించిన ప్రభుత్వం

దాచేపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ప్రభుత్వం స్వర్ణకారులను గుర్తించి వారికి ప్రత్యేకమైన స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేయడం స్వర్ణకారులకు తగిన గుర్తింపును ఇచ్చిందని దాచేపల్లి స్వర్ణకారుల సంఘ అధ్యక్షుడు శ్రీరామదాసు ఆంజనేయచారి తెలిపారు. శనివారం దాచేపల్లిలో నిర్వహించిన స్వర్ణకారుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం స్వర్ణకారుల సమస్యలపై సానుకూలంగా స్పందించడంతో పాటు కార్పొరేషన్ ఏర్పాటుచేసి అన్నివిధాల ఆదుకుంటుందన్నారు. సమావేశంలో శ్రీరామదాసు బ్రహ్మయ్య, బిక్షమాచారి, కీసరి శ్రీనివాసచారి, మల్లెం ఆదినారాయణ, మల్లెం బ్రహ్మం, ముంజుపల్లి వెంకటాచారి, కీసరి కొండలుచారి పాల్గొన్నారు.

చెస్‌లో 'కిడ్స్' విద్యార్థుల ప్రతిభ


మాచర్లటౌన్, పిడుగురాళ్ల, అక్టోబరు 19: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన జరిగిన జిల్లా స్థాయి చెస్ సెలక్షన్‌లో తమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు పట్టణంలోని కిడ్స్ పాఠశాల హెచ్‌ఎం జొన్నలగడ్డ రామకృష్ణశాస్త్రి తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రామకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ గుంటూరులోని చైత్రా సెంటర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో నిర్వహించిన అండర్ - 17 విభాగం జిల్లా స్థాయి చెస్ పోటీల్లో చంద్రమహేష్, భార్గవ శ్రీనివాస్ నాయక్‌లు గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు.

పిడుగురాళ్లలోని తిరుమల ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌కు చెందిన ఆర్ లోకేష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 29, 30 తేదీల్లో అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో లోకేశ్ పాల్గొనున్నట్లు తిరుమల ఆక్స్‌ఫర్డ్ స్కూల్ డైరెక్టర్ బొల్లా గిరిబాబు, ప్రిన్సిపాల్ నరేష్ తెలిపారు.

వ్యవసాయ అధికారులకు శిక్షణ

అచ్చంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్ర మైన అచ్చంపేటలోని రైతు సేవా కేంద్రంలో శనివారం డివిజన్ స్థాయి వ్యవసాయ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ ఎం శివకుమారి మాట్లాడుతూ పత్తి పంటలో గులాబీరంగు పురుగు, కొయ తొలిచే పురుగు, రసం పీల్చే పురుగుల నివారణ చర్యలు, కంది, వరి పంటలో సమగ్ర పంట యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.

మగువ మేలుకో.. తెలుసుకో



మహిళలు.. సముద్రాన్ని సోదిస్తున్నారు.. అంతరిక్షాన్ని అందుకుంటున్నారు.. దేశ రక్షణ దిశలో అడుగులేస్తున్నారు.. కానీ వారి భద్రత ప్రశ్నార్థకంగా ఉంది. ఇంటి నుంచి బయటకు అడుగుపెడితే భయం. పగలు.. రాత్రీ.. అన్న తేడా లేకుండా ఏదో ఒక దారుణం. నేరాలు.. ఘోరాల్లో మహిళలు సమిధులుగా మారుతున్నారు. వయసు తారతమ్యాలు లేకుండానే మృగాలు వెంటాడుతున్నాయి.. వేధిస్తున్నాయి.. వధిస్తున్నాయి. రాజ్యాంగం ఎన్ని రక్షణ చట్టాలు కల్పించినా అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. నేతలు, అధికారులు వేదికలపై మహిళా రక్షణ గురించి చేస్తున్న ప్రకటనలు గాలిలో కలుస్తున్నాయి. అసలు మహిళలు తమకు రాజ్యాంగం కల్పించిన రక్షణ చట్టాల గురించే తెలుసుకోవడంలేదు. ఇదే అవకాశంగా మహిళలు నానాటికీ అణిచివేతకు గురవుతున్నారు. మహిళలకు రాజ్యాంగం కల్పించిన చట్టాల గురించి ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం ప్రత్యేక కథనం..

- మహిళలకు రక్షణగా రాజ్యాంగం
- ప్రభుత్వం కల్పించిన చట్టాలు కోకొల్లలు
- అతివల అరచేతిలోనే టోల్ ఫ్రీ నెంబర్లు
- అవగాహన లేమితో తలెత్తుతున్న సమస్యలు
- మహిళలను చైతన్య పరచడంలో వెనకడుగే

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలపై పరంపరగా సాగుతున్న అత్యాచారాలు, హత్యలు, సామూహిక అఘాయిత్యాలు సమాజాన్ని కలవర పెడుతున్నాయి. సాంకేతికత, నాగరికత ఎంత విస్తరించినా మహిళలకు అన్యాయాలు.. వారిపై అత్యాచారాలు తగ్గడంలేదు. విద్యాలయం మొదలు పనిచేసే ప్రదేశం వరకూ అతివల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. మహిళల రక్షణకు రాజ్యాంగం ఎన్నో చట్టాలు రూపొందించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మహిళల రక్షణ కోసం చట్టాలు తెస్తున్నాయి. వచ్చిన సమస్యల్లా తమకు అన్ని రక్షణలు ఉన్నాయని మహిళలు తెలుసుకోలేకపోవడమే. ఆ చట్టాలపై వారిలో అవగాహన లేకపోవడమే. తాజా పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంలో మహిళలు ప్రతి ఒక్కరూ.. చిన్నా, పెద్ద అన్న తేడా లేకుండా తమకోసం రాజ్యాంగం కల్పించిన హక్కులు, తెచ్చిన చట్టాల గురించి తెలుసుకోవడం ఎంతో అవసరం. తద్వారా మహిళల రక్షణ వారి చేతుల్లోనే ఉంటుంది.



● స్త్రీల గౌరవ మర్యాదలకు భంగం..

మహిళలను వేధించినా బలవన్మారణానికి పురికొల్పినా, హత్య చేసినా, అత్యాచారం చేసినా, అవమానపర్చినా, వారి హక్కులకు భంగం కలిగించేలా ప్రవర్తించినా భారత శిక్షాస్మృతి కింద నేరంగా పరిగణిస్తారు. మహిళలను అవమానిస్తూ మాటల రూపంలో, సంజ్ఞల రూపంలో, ఏదైనా ప్రదర్శన ద్వారా అసభ్యకర ప్రవర్తనతో కించపరిస్తే ఆ నేరానికి ఏడాది సాధారణజైలు, జరిమానా విధిస్తారు. నేర పూర్వక బలవంతం, సంజ్ఞల ద్వారా మహిళలను వేధిస్తే సెక్షను 354 (ఎ)ప్రకారం ఐదేళ్లకు తగ్గకుండా ఏడేళ్ల వరకూ జైలు శిక్ష, జరిమానా.

● సభ్యత - నైతిక నియమాల ఉల్లంఘనకు..

బహిరంగ ప్రదేశంలో అసభ్యకర పాటలు పాడటం, మరేదైనా అసభ్యకర చర్యలు చేయడం సెక్షన్ 294 ప్రకారం నేరం. ఇందుకు మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా. బాల, బాలికలకు అసభ్యకర సాహిత్యం, వస్తు సామగ్రి వంటివి విక్రయించడం తీవ్ర నేరంగా సెక్షన్ 293 ప్రకటించింది. ఈ నేరం కింద మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకు జైలుశిక్ష, జరిమానా తప్పదు.

● అత్యాచారం, ఆ తరహా నేరాలకు..

హింసా ప్రవృత్తితో స్త్రీ ఇష్టానికి వ్యతిరేకంగా లైంగిక అపచారం అత్యాచార నేరంగా పరిగణిస్తారు. సెక్షన్ 376 'ఏ' నుంచి 'డీ' వరకు క్లాజులలో సందర్భం, తీవ్రతను బట్టి శిక్షలు విధిస్తారు. సెక్షను 376(1) ప్రకారం ఏడేళ్లకు తగ్గకుండా పదేళ్ల వరకూ, ప్రత్యేక సందర్భాల్లో జీవితకాలం వరకు జైలుశిక్ష జరిమానా విధించే అవకాశం ఉంది. నిర్భయ చట్టం కింద కేసు నమోదై విచారణలో దోషులుగా తేలితే ఉరిశిక్ష విధించే అవకాశం ఉంది.

● మోసపూరితంగా నమ్మించి ఇష్టంలేని వివాహానికి ప్రయత్నిస్తే ఆ వ్యక్తికి సెక్షను 366 ప్రకారం పదేళ్ల జైలు, జరిమానా విధిస్తారు.

అరచేతిలోనే రక్షణ

మహిళలను సంరక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రక్షణచర్యలు చేపడుతున్నాయి. సెల్‌ఫోన్ వచ్చిన తరువాత మహిళా రక్షణ అవకాశాలు మరింత పెరిగాయి. మహిళ తనకు ప్రమాదం ఎదురైనప్పుడు ఎమర్జెన్సీ టోల్‌ఫ్రీ నెంబర్లకు 100, 112, 1091, 181 ఫోన్లు చేయవచ్చు. స్మార్ట్‌ఫోన్‌కు ఉండే పవర్‌బటన్‌ను మూడుసార్లు ఆపకుండా నొక్కితే ఎమర్జెన్సీ కాల్ 112కి కాల్ వెళుతుంది. కాకపోతే దీనిపై మహిళలకు అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు ఇంకా జరుగుతున్నాయి. దీనిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా వుంది.

ఐసీడీఎస్ కృషి నామమాత్రమే

మహిళలను చైతన్య పరచడంలో ప్రభుత్వం ఇంకా వెనకంజలోనే ఉంది. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నా అవి నామమాత్రంగానే ఉన్నాయి. గుంటూరు జిల్లాలో గడిచిన 8 నెలల్లో 360 అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. వీటి ద్వారా గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పురుషుల అపసవ్య ప్రవర్తనపై చిన్నారులు, మహిళలకు అవగాహన కల్పించారు. అయితే ఇవి నామమాత్రమనే చెప్పాలి. రోజువారీ కార్యక్రమంగా అవగాహన కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ప్రభుత్వంపై ఎంతైనా ఉంది.

రాజ్యాంగం కల్పించిన హక్కులు

రాజ్యాంగం రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా స్త్రీ, పురుషులకు సమాన అవకాశాలు కల్పించింది. లింగ వివక్షతను నిషేధించింది. స్త్రీల గౌరవాన్ని కించపరిచే పని ఏదీ చేయకూడదనేది ప్రతి పౌరుడి ప్రాథమిక విధిగా ప్రకటించింది. మహిళలు, చిన్నారుల అక్రమ రవాణాను నివారించేందుకు 1958లో అక్రమరవాణా నిరోధక చట్టాన్ని అమలులోకి తెచ్చింది. రాష్ట్రప్రభుత్వం 1988లో దేవదాసీ వ్యవస్థ నిషేధచట్టాన్ని తెచ్చింది. స్త్రీ అసభ్య చిత్రీకరణ నిషేధ చట్టాన్ని 1986లో తెచ్చింది. 1984లో కుటుంబ న్యాయస్థానాల చట్టం, 2001లో జాతీయ ఉచిత న్యాయ సహాయ సేవాసంస్థ, 2004లో మహిళా న్యాయస్థానాలు ఏర్పాటుచేశారు. 2013లో నిర్భయ చట్టం తీసుకువచ్చారు. ఈ చట్టం ప్రకారం అత్యాచారానికి పాల్పడిన వారికి గరిష్ఠంగా ఉరి శిక్ష విధించే విధంగా చట్టాన్ని రూపొందించారు. నిర్భయ నింధితులను ఈ చట్టం కింద నింధితులను ఉరి తీశారు.

అవగాహనే శ్రీరామ రక్ష

మహిళల కోసం ప్రభుత్వం అనేక రక్షణలు కల్పించింది. ఐసీడీఎస్ ద్వారా నిరంతరాయంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అయినా మహిళల్లో చట్టాలు, రక్షణలపై అవగాహనా లేమి కనిపిస్తోంది. అవగాహన పెంచుకుంటేనే మహిళలకు స్వీయ రక్షణ సాధ్యమవుతుంది. ప్రధానంగా చిన్నారులు మోసకారుల బారిన పడకుండా రక్షించుకోగలుగుతాం.

- పద్మావతి, ఐసీడీఎస్ పీడీ, గుంటూరు

అటకెక్కుతున్న అట్లతద్దె!

● గ్రామాల్లో కనుమరుగవుతున్న సాంప్రదాయ పండుగలు

బాపట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : అట్లతద్దె పండుగ వచ్చిందంటే చాలు ప్రతి గ్రామంలో ఉయ్యాలలు ఏర్పాటు చేసి ఆడపడుచులు నోములు నోచుకొని వాయినాలు పంచేవారు. తెల్లవారుజాము నుంచే ఉయ్యాల ఏర్పాటు చేసిన ప్రాంతంలో మైక్‌లు పెట్టి ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. పెద్దఎత్తున సందడి చేసేవారు. నాటి వేడుకలు నేడు కనిపించటంలేదు. గ్రామాలు మొత్తం కలియతిరిగితే ఎక్కడో ఒకచోట మాత్రమే ఉయ్యాల కనిపిస్తున్నది. దానిపై ఊగేవారు కేవలం కొద్ది మంది మాత్రమే ఉంటున్నారు. ఒకప్పుడు ఉయ్యాల దగ్గర గ్రామస్తులంతా వరుసగా నిలబడి ఒకరితర్వాత ఒకరు ఊగే వారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి కనిపించటంలేదు. వేడుకలను కూడా మొక్కుబడిగా చేస్తున్నారు. భర్త ఆయురారోగ్యాలతో ఉండాలని, 11 మంది ముత్తయిదువులు చంద్రోదయ ఉమాగౌరి వ్రతం చేసి 11 మందికి వాయినాలు ఇస్తారు. అదేవిధంగా ఒక పోతురాజుకు కూడా వాయినం ఇచ్చేవారు. ఈసందడి ప్రతిగ్రామంలో కనిపించేది. ఇళ్ళు శుభ్రం చేసి ఇంటి ముందు ముగ్గులు వేసి వేడుకగా జరుపుకునే ఈ కార్యక్రమాలు కాలక్రమేణ అక్కడక్కడ మాత్రమే కనిపిస్తున్నాయి. ప్రజలు సోషల్‌మీడియాకు అలవాటుపడిపోయి నాటి సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆసక్తిచూపటంలేదని పలువురు పేర్కొంటున్నారు. ఇదేవిధంగా జరిగితే భవిష్యత్తు తరాలకు సాంప్రదాయక పండుగలు, వేడుకలు ఉండేవనే విషయం కూడా తెలియక పోవచ్చు. కావున సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.



పడమరబాపట్ల పంచాయతీ వైఎస్సార్ నగర్‌లో అట్లతద్దె సందర్భంగా ఏర్పాటు చేసిన ఉయ్యాల

ప్రకాశం బ్యారేజి వద్ద

పెరిగిన వరద ఉధృతి

● దిగువకు 77 వేల 750 క్యూసెక్కులు



తాడేపల్లి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎగువన ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశంబ్యారేజి వద్ద వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 84 వేల 297 క్యూసెక్కుల వరదనీరు శనివారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 40గేట్లను 2అడుగులు, 30 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 77 వేల 750 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువలకు 4,028 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా కాలువకు 2,519 క్యూసెక్కులు వదులుతున్నట్టు తెలిపారు.

నాగార్జున సాగర్ ప్రాజెక్టు 12 క్రస్ట్ గేట్ల ద్వారా నీరు విడుదల

మాచర్ల రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ 12 క్రస్ట్ గేట్ల ద్వారా అధికారులు శనివారం నీటిని విడుదల చేశారు. 12 గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 97,200 క్యూసెక్కులను దిగువకు విడుదలచేశారు. సాగర్ నీటిమట్టం 590 అడుగులు వుంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడికాలువ ద్వారా 4,940 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6,173 ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,638, 12 క్రస్ట్ గేట్ల ద్వారా 97,200, ఎల్ఎల్‌సీ ద్వారా 400, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు మొత్తం అవుట్‌ఫ్లో వాటర్‌గా 1,40,151 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుండి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 1,40,151 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది.

స్టాండింగ్ కమిటీ సభ్యుల

నియామకం జరిగేనా ?

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యుల పదవికాలం పూర్తయింది. ఇప్పటి వరకు మేయర్ మనోహర్‌నాయుడు అధ్యక్షుడిగా, మరో ఆరుగురు సభ్యులతో నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఏర్పడింది. ప్రతి సంవత్సరం ఎన్నికల ద్వారా స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకుంటారు. వారు ఏడాది పాటు పదవిలో కొనసాగుతారు. ప్రతి ఏటా జరిగే ఈఎన్నికల్లో చైర్మన్ మేయర్ కొనసాగుతూ, సభ్యులు మారుతూ ఉంటారు. ఈ ఏడాది ఆగస్టు 6వ తేదీతో ప్రస్తుత స్టాండింగ్ కమిటీకి పదవికాలం పూర్తయింది. ఈకమిటీలో సభ్యులుగా కార్పొరేటర్ షేక్ మహమ్మద్, సంకూరు శ్రీనివాసరావు, కాంద్రగుంట గురువయ్య, శ్యామల వెంకటరమణాదేవి, మాలిబోయిన శ్రీవల్లి, పాపతోటి అంబేద్కర్‌లు ఈ పదవుల్లో కొనసాగారు. ఆగస్టు ఆరో తేది నుంచి వీరంతా మాజీలయ్యారు. అప్పటినుండి కొత్త కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వలేదు. వాస్తవానికి నగరంలో రూ.50 లక్షల రూపాయల వర్క్ చేపట్టాలంటే స్టాండింగ్ కమిటీ ఆమోదం తప్పనిసరి. ఇంతటి ప్రాధాన్యత కలిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికను నిర్వహించక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రైలు హాల్టింగ్‌కు మోక్షమెప్పుడు ?

వేమూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : డెల్టా ఎక్స్‌ప్రెస్ రైలు వేమూరులో నిలుపుదల చేయాలంటూ ఈ ప్రాంత ప్రజలు అనేక మార్లు మొరపెట్టుకున్నా ఫలితం కానరాకుంది. సికింద్రాబాద్-రేపల్లె వెళ్లే డెల్టా ఎక్స్‌ప్రెస్ రైలు గతంలో వేమూరులో హాల్ట్ ఉండేది. కరోనా సమయంలో కొన్ని రైళ్లు రద్దు చేసిన తర్వాత తిరిగి వేమూరులో రైలు పునరుద్దరణలో చేసిన కొన్ని చోట్ల హాల్ట్‌లు ఎత్తివేశారు. ఆ నేపథ్యంలో డెల్టా ఎక్స్‌ప్రెస్ రైలు వేమూరులో నిలుపుదల చేయకుండా తెనాలి, చినరావూరు, భట్టిప్రోలులో నిలుపుదల చేస్తున్నారు. వేమూరులో హాల్ట్ ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు స్థానిక ప్రజా ప్రతినిధులకు రైల్వేశాఖ అధికారులకు అనేకమార్లు ఫిర్యాదు చేసిన ఫలితం కానరాకుంది. ఈ మధ్య కాలంలో బాపట్ల పార్లమెంట్ సభ్యుడు తేన్నేటి కృష్ణప్రసాద్‌ను వేమూరు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కలిసి వినతులు అందజేశారు. అదే విధంగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు అనేకమార్లు వినతులు అందించారు. నేటి వరకు డెల్టా రైలు వేమూరులో హాల్ట్ ఏర్పాటు చేయక పోవడం పట్ల ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పార్లమెంట్ సభ్యుడు కృష్ణప్రసాద్ డెల్టా రైలు వేమూరులో నిలుపుదల చేసే విదంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నాయి. ఇంత వరకు వేమూరులో డెల్టా రైలు నిలుపుదల కాకపోవడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు. తక్షణం ప్రజా ప్రతినిధులు రైల్వే అధికారులు స్పందించి డెల్టా ఎక్స్‌ప్రెస్ రైలు వేమూరులో నిలుపుదలచేసేలా చర్యలు తీసుకోవాలని వేమూరు పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



వీరగల్లు శిల్పాన్ని పరిశీలిస్తున్న సతీష్‌బాబు

వెయ్యి సంవత్సరాల నాటి

విగ్రహం లభ్యం



మాచర్లటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):దుర్గి మండలం బుగ్గవాగు రిజర్వాయర్ ప్రాంతంలోని పిచ్చిమొక్కల మధ్య సుమారు వెయ్యి ఏళ్లనాటి వీరగల్లు విగ్రహాన్ని చరిత్ర పరిశోధకుడు పావులూరి సతీష్ బాబు గుర్తించారు. కుడిచేతిలో కత్తి, ఎడమ చేతిలో డాలు, చెవులకు పెద్ద కుండలాలు, మెడలో గొలుసులు, చేతులకు రుద్రాక్ష మాల ధరించి శత్రువుతో పోరాడుతున్నట్లు శిల్పం ఉందన్నారు. ఆనాటి ప్రజలు మృతి చెందిన వీరుల శిల్పాలను చెక్కి చెరువులు, బావులు, గ్రామ పొలిమేరలు, ఆలయాలవద్ద ప్రతిష్ఠించేవారని సతీష్‌బాబు తెలిపారు. అలనాటి వీరుల శిల్పాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సతీష్‌బాబువెంట ఉప్పుతోళ్ల రమేష్, కిరణ్‌లు ఉన్నారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్ ఛాంపియన్ తమిళనాడు



ఓవరాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను తమిళనాడు మహిళా జట్టుకు అందజేస్తున్న నిర్వాహకులు

పెదకాకాని, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యునివర్సిటీ వేదికగా మూడు రోజులుగా జరుగుతున్న 35వ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలలో తమిళనాడు రాష్ట్రం ఓవర్ ఆల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. అలాగే బాలుర విభాగంలోనూ, బాలికల విభాగంలోనూ తమిళనాడు రాష్ట్రం అత్యధిక పాయింట్లు సాధించి రికార్డు సృష్టించారు. మూడు కేటగిరిలో తమిళనాడు మొదటి స్థానంలో నిలవడం గమనార్హం. విజేతలకు పోటీల నిర్వాహక కార్యదర్శి ఎ. గౌతమ్ కిరణ్, ఏఎన్‌యూ వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్, అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈసీ మెంబర్ ఏ హైమావతి, జాయింట్ సెక్రటరీ ఏ.వీ. రాఘవేంద్రరావు, తెలంగాణ అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ కె. సారంగపాణి, మాజీ ఇంటర్నేషనల్ అథ్లెట్ శ్రీనివాస్, అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా టెక్నికల్ అఫీషియల్ శ్రీనివాసరావు, టెక్నికల్ కమిటీ చైర్మన్ ఎం. నారాయణరావు, ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కే. మధుసూదన్‌రావు తదితరులు విజేతలకు ట్రోఫీలను అందజేశారు.

గుంటూరు రేషన్ దొంగలు

నల్గొండలో దొరికారు

- 550 క్వింటాళ్ల పేదల బియ్యం స్వాధీనం
- పట్టుకున్న బియ్యం విలువ రూ. 18 లక్షలు ఉంటుందని అంచనా
- బాపట్లకు చెందిన సుధాకర్, కర్ణాటకకు చెందిన సలావుద్దీన్ అరెస్టు
- విషయం తెలుసుకొని మాఫియా నేత పరారీ

గుంటూరు, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): రేషన్‌మాఫియా ఆగడాలు అరికట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో పట్టుదలతో ఉన్నప్పటికీ లారీల కొద్దీ రేషన్ బియ్యం రాష్ట్ర సరిహద్దులు దాటుతూనే ఉన్నది. రెండు రోజుల క్రితం ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన రేషన్‌మాఫియా సేకరించిన బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి సన్న బియ్యం రూపంలో ఆంధ్రప్రదేశ్ పోలీసుల కన్నుగప్పి సరిహద్దు దాటించినప్పటికీ నల్గొండ పోలీసులు, పౌర సరఫరాలశాఖ అధికారుల వలలో చిక్కారు. రెండు లారీల్లో తరలిస్తున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకొని మాఫియాలో కీలకపాత్ర పోషిస్తున్న బాపట్ల పట్టణానికి చెందిన చీమకుర్తి సుధాకర్‌ను అరెస్టు చేశారు. అతనితో పాటు కర్ణాటకకు చెందిన లారీ డ్రైవర్ సలావుద్దీన్, మరో డ్రైవర్ భీమయ్యను అరెస్టు చేశారు. ఈ మాఫియాలో మరొక భాగస్వామి అయిన గుంటూరు పట్టణానికి చెందిన అశోక్ పరారయ్యాడు. వీరు ఈ విధంగా ప్రతి నెలా 10 నుంచి 12 లారీల పీడీఎస్ బియ్యాన్ని ఆంధ్రప్రదేశ్ సరిహద్దులు దాటించి పక్క రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలకు అక్రమ రవాణా చేస్తున్నట్టు నల్గొండ పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ క్రమంలోనే గురువారం కేఏ 56, 2700 నెంబరు గల లారీలో తెలంగాణ వైపు తరలివెళుతున్న 245 క్వింటాళ్ళ బియ్యాన్ని పట్టుకున్నారు. అదే విధంగా జీజే 25 యూ 2727 నెంబరు గల మరో లారీలో తరలిస్తున్న 250 క్వింటాళ్ళ పీడీఎఫ్ బియ్యాన్ని పట్టుకోవటం జరిగింది. సుధాకర్ గత కొన్ని సంవత్సరాలుగా బాపట్లలోని తన రైస్ మిల్లు (శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర అయ్యప్ప ట్రేడర్స్)లో రైతుల నుంచి సేకరించిన వడ్లతో పాటు గుంటూరు, బాపట్ల, నరసరావుపేటల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసిన పీడీఎఫ్ రైస్‌ను రీ సైక్లింగ్ చేసి వాటిని సన్నబియ్యం వలె పాలిష్ చేసి 20 కేజీలు, 30 కేజీల ప్లాస్టిక్ సూపర్ బ్యాగ్స్‌లో పార్సిల్ చేసి వాటికి సంబంధించి నకిలీ బిల్లులు కూడా రూపొందించి ఈ దొంగ వ్యాపారం చేస్తున్నట్టు వెల్లడైంది. గుంటూరుకు చెందిన అశోక్ కూడా ఇందులో పాత్ర ధారి అని సుధాకర్ ద్వారా తెలుసుకున్న నల్గొండ పోలీసులు అతన్ని అరెస్టు చేసేందుకు గుంటూరుకు వచ్చినట్లు సమాచారం. అయితే అతను పరారీలో ఉన్నట్టు తెలుసుకొని వెనుతిరిగిపోయినట్టు తెలిసింది. వీటి విలువ రూ. 18 లక్షలకు పైగానేఉంటుందని నిర్ధారించారు. ఏపీ నుంచి ఇంత భారీ మొత్తంలో బియ్యం తరలిపోతుంటే పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్న తలెత్తుతోంది.

జిల్లా స్థాయిలో అధికారులకు మాఫియాతో బలమైన సంబంధాలు వున్న నేపథ్యంలో వారికి ఫిర్యాదు చేయడానికి ఎవరూ ఇష్టపడడం లేదు. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడమే మేలనే పరిస్థితి ఏర్పడింది. అక్కడ కూడా పరిష్కారం కాకపోతే ఆయా శాఖల రాష్ట్ర అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు తప్ప వీరికి మాత్రం ఫిర్యాదులు చేయడం లేదు. ఈ పరిస్థితులను చక్క దిద్దడం కోసం విజిలెన్స్ శాఖ ప్రక్షాళన చేపట్టింది. పలువురు అధికారులను బదిలీ చేసింది. కానీ పరిస్థితిలో మార్పు లేదు. విజిలెన్స్ ఎస్పీ అడపాదడపా దాడులు చేస్తున్నారు తప్ప నిఘా విభాగం ఏమాత్రం గాడిలో పడలేదు. ఇంత పెద్ద మొత్తంలో బియ్యం తరలిపోతున్నా సంబంధిత పౌర సరఫరాల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం విశేషం. తాజాగా ఒక కేసులో 80 బస్తాలు బియ్యం పట్టుకుని కేవలం 1100 కిలోల బియ్యమే దొరికినట్లు చూపారన్న విమర్శలు గుప్పుమంటుండడంతో మాఫియాతో అధికారుల సంబంధాలు ఉన్నాయన్న వాదనకు బలం చేకూరుతోంది.

రేషన్ బియ్యం ఎక్కడ దొరికినా మూలాలు ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే..

గుంటూరుజిల్లా రేషన్ మాఫియా అక్రమాలు 'ఆంధ్రజ్యోతి' బయట పెట్టడం తో మాఫియా కొత్త భాగస్వాములతో వ్యవహారం నడుపుతోంది. గుంటూరు కాకాని రోడ్డులోని మిల్లు భాగోతం బయట పడడంతో జిల్లాలోని ఐదోమైలు సమీపంలోని ఒక మిల్లు, చేబ్రోలు, వట్టిచెరుకూరు, పేరేచర్ల, ఫిరంగిపురంలలోని మిల్లులకు రేషన్‌బియ్యాన్ని తెచ్చి సన్న బియ్యంగా మార్చి తరలిస్తున్నారు.



రేషన్‌మాఫియా అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న నల్గొండ పోలీసులు (ఫైల్)

సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టుకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

నాదెండ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. అండర్-14 బాలుర విభాగంలో వనపర్తి జశ్వంత్ తేజ, బాలికల విభాగంలో సిద్దాబత్తుని మోహనలక్ష్మిలు ఎంపికయ్యారు. త్వరలో చిత్తూరులో జరగనున్న పోటీల్లో జిల్లా జట్టు నుంచి వీరిద్దరు ఆడనున్నారు. ఈ సందర్భంగా వారిని హెచ్ఎం వెంకటరావు, పీడీ అంజమ్మలు అభినందించారు.

అధ్వానంగా హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ ఆవరణ


అధ్వానంగా ఉన్న హోల్ సేల్ కూరగాయల మార్కెట్, అపరిశుభ్రంగా ఉన్న ఆవరణ

● ఇక్కట్లు పడుతున్న వినియోగదారులు

వినుకొండ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వినుకొండ పట్టణంలోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ అధ్వానంగా మారింది. చినుకుపడితే చాలు మార్కెట్ మొత్తం బురదమయమవుతోంది. వేకువజాము నుంచి కూరగాయలకు వచ్చే వ్యాపారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి పండించిన పంటలను మార్కెట్ తరలించాలన్నా, మార్కెట్‌కు వచ్చిన బస్తాలను మార్కెట్‌లో లాట్‌కట్టాలన్నా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కెట్ ఆవరణలో కాలు పెట్టే పరిస్థితి కనిపించక పోవడంతో కొనుగోలుదారులు మార్కెట్ ముఖం చూసేనాథుడు లేక రైతులు, వ్యాపారులకు నిత్యం నష్టాలు చవిచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రొచ్చులో కుళ్లిన కూరగాయల కారణంగా దుర్వాసనతో కూలీలు కూడా మార్కెట్‌కు రాకపోవడంతో యజమానులకు తిప్పలు తప్పడంలేదు. మున్సిపల్ అధికారులు మార్కెట్ ప్రాంతాన్ని సందర్శించి వ్యాపారులకు, కొనుగోలు, అమ్మకందారులతో పాటు, కార్మికులు, రైతులకు అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టాని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మునిసిపల్ పార్కు గోడ.. కళావేదిక ధ్వంసం

● అధికార పార్టీ నేత నిర్వాహం ● చోద్యం చూస్తున్న మునిసిపల్ అధికారులు

నరసరావుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో తెలుగు తల్లి విగ్రహం రీతిలోనే మరో సంఘటన చోటు చేసుకుంది. ఎన్‌జీవో కాలనీలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఉద్యానవనం ప్రహరీ.. పార్కులోని కళావేదికను ధ్వంసం చేశారు. అధికార పార్టీ నేత ఒకరు ఈ ఘటనకు పాల్పడ్డాడు. మునిసిపల్ ఆస్తిని ధ్వంసంచేస్తే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలున్నాయి. అమృత్ పథకం కింద తెలుగుదేశం కౌన్సిల్ హయాంలో పార్కును అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా కళావేదికను నిర్మించారు. దీనికి ఎటువంటి అనుమతులు లేకుండా ఓ వ్యక్తి కూల్చివేయడం గమనార్హం. ఈ ప్రదేశంలో తన తల్లిదండ్రుల పేరుపై భవనం నిర్మిస్తానని సదరు వ్యక్తి చెబుతున్నాడు. ఇలా నిర్మాణం చేయాలంటే మునిసిపాల్టీ అనుమతి తీసుకోవాలి. ఉన్న కట్టడాలను తొలగించాలన్నా మునిసిపాల్టీ అనుమతి తప్పనిసరి. ఇవేవి లేకుండానే అధికారం అండతో పార్కులో ఉన్న కట్టడాలను కూల్చివేశాడు. భవనం నిర్మించాలని మంచి ఉద్దేశ్యం ఉన్నట్లయితే అందుకు అయ్యే వ్యయం మొత్తాన్ని మునిసిపాల్టీ అనుమతికి లోబడి జమ చేయాల్సి ఉంది. భవనం నిర్మాణానికి కూడా మునిసిపాల్టీ నుంచి ఎటువంటి అనమతులు లేవు. పార్కులో భవనం నిర్మించాలన్న యోచన లేదని మునిసిపల్ అధికారులు చెబుతున్నారు. ఎటువంటి అనుమతి లేకుండా పార్కులో కట్టడాలను తొలగించడాన్ని ఎలా చూడాలి. కేవలం అధికారం ఉండటం వలనే ఈ ఘటనలకు పాల్పడ్డారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అక్కడ భవనం నిర్మించాలంటే మునిసిపాల్టీ అనుమతులు పొందాలన్న అంశాన్ని గుర్తించాలి. ఉద్దేశం మంచిదైనా దానిని చట్టప్రకారం అమలు చేయాలని సదరు వ్యక్తి గుర్తించకపోవడం గమనార్హం. గోడ.. కళావేదిక కూల్చివేతపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ జస్వంత్ శనివారం తెలిపారు. పార్కులో తొలగింపులు, నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు లేవని ఆయన స్పష్టం చేశారు.


ఎన్‌జీవో కాలనీలోని మునిసిపల్ పార్కు గోడ.. కళా వేదిక ధ్వంసం

మెగా జాబ్‌మేళాలో 862 మందికి ఉద్యోగాలు


జాబ్ మేళాలో ఉద్యోగాలు వచ్చిన వారితో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట యువత నిరుద్యోగుల కోసం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చిందని, 862 మందికి ఉద్యోగాలు లభించాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రకటించారు. పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో శనివారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలి సారి పెద్ద ఎత్తున నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 2427 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారిలో 472 మంది నేరుగా ఎంపికయ్యారని, మరో 390 మందిని షార్ట్ లిస్ట్ చేశారన్నారు. మొత్తం మీద రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో దాదాపు 30 శాతం మంది ఎంపిక కావటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి నిరుద్యోగులు, యువత నుంచి విశేష స్పందన లభించిందని, టెక్ మహేంద్ర, టెలిఫర్‌ఫామెన్స్, సదరు ల్యాండ్, యాక్సిస్ ఎన్ఐఐటీ, టాటా, రిలయన్స్ జియో ఇన్‌ఫో.కామ్ లిమిటెడ్, టాటా ట్రెండ్ లిమిటెడ్, పేటీఎం, ఎస్‌డీపీ గ్లోబల్ సర్వీసెస్ టీమ్ లీజ్ సర్వీసెస్ హీరో, హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఎంపవర్‌మెంట్ సర్వీసెస్, ఫోన్ పే, అపోలో ఫార్మసిస్ లిమిటెడ్, నెట్ ఫ్లస్, ముత్తూట్ గ్రూపు, ఎంఆర్‌ఎఫ్ టైర్స్ సహా మొత్తం 36 సంస్థలు పాల్గొన్నాయని, ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన 472 మందికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి నియామక పత్రాలు అందజేశారు. ఉద్యోగాలు సాధించిన వారందరికీ ప్రత్తిపాటి శుభాకాంక్షలు తెలియజేశారు. దేశంలో చదువులు లేని వారు ఎంతో ఉన్నత స్థాయికి చేరారని, ఆంగ్ల భాషపై పట్టులేని వారు కూడా శిక్షణ తీసుకుంటే ఉద్యోగం సాధించటం సులభమన్నారు. ఇప్పుడు మొబైల్‌లోనే ఎన్నో భాషలు నేర్చుకొనే అవకాశం ఉందన్నారు. ఈ సానుకూల అంశాలను యువత వినియోగించుకోవాలని సూచించారు. ఈ ఐదు సంవత్సరాల్లో మొత్తం 20 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అలాగే ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేసేందుకు విధానాలు తీసుకువస్తున్నట్టు సీఎం చంద్రబాబు స్పష్టంగా చెప్పారన్నారు. ఇదే సమయంలో ఉద్యోగ మేళాలో ఎంపిక కాని వారి కోసం ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం కింద రుణ మేళాలు పెట్టి రూ.10 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు రెండు శాతం వడ్డీకి 30 శాతం రాయితీపై అందిస్తామన్నారు. పీఎంఈజీపీ కింద 12 పథకాలు ఉన్నాయని, నిరుద్యోగులు వాటిలో దేనిని ఎంచుకున్నా సెక్యూరిటీ లేకుండా రూ.10 లక్షలు, సెక్యూరిటీతో రూ.40 లక్షల వరకు ఇస్తున్నారని, ఇంటికో పారిశ్రామికవేత్త పథకంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక పార్కు పెట్టాలని ముఖ్యమంత్రి చెప్పారన్నారు. ఈ పార్కుకు స్థానిక ఎమ్మెల్యేనే చైర్మన్‌గా ఉండాలని స్పష్టం చేశారన్నారు.

నరసరావుపేటలో ఏడు కిలోల గంజాయి స్వాధీనం

నరసరావుపేట లీగల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో పెద్ద ఎత్తున గంజాయిని పోలీసులు స్వాధీన పరచుకున్నారు. ఏడు కేజీల గంజాయితో పాటు ఆరు దిచక్ర వాహనాలను, ఒక కారును స్వాధీన పరచుకుని, నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. శ్మశాన వాటికను గంజాయి విక్రయాలను అడ్డాగా మార్చుకున్నారు. ఎస్ఎస్ఎన్ కళాశాల పక్కన ఉన్న శ్మశాన వాటికలో గంజాయి నిల్వ చేశారు. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు శ్మశాన వాటికలో తనిఖీచేసి ఏడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్నవారిలో వైసీపీ కార్యకర్త చింతపల్లి సుభాని, ఖాదర్, సుభాని తదితరులు ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై మొదటి పట్టణ సీఐని సంప్రదించడానికి ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి: తహసీల్దార్ విజయశ్రీ

చెంఘీజ్‌ఖాన్‌పేట (యడ్లపాడు), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విజయశ్రీ కోరారు. రెవెన్యూ సదస్సులలో భాగంగా మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేటలో శనివారం గ్రామ సభను నిర్వహించారు. కోట, చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామాలకు సంబంధించి నిర్వహించిన సదస్సులో కొలతల్లో వ్యత్యాసాలు, సబ్ డివిజన్, మ్యుటేషన్ తదితర సమస్యలకు సంబంధించి సమస్యలను పరిష్కరించాలంటూ 14మంది రైతులు దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో డీటీ అనూరాధ, మండల సర్వేయర్ సురేంద్ర, కోట గ్రామ సర్పంచ్ హఫీజ్‌బేగ్, రెవెన్యూ, దేవదాయ, అటవీశాఖల అధికారులు పాల్గొన్నారు.

బీసీల రక్షణకు చట్టాలను అమలు చేయాలి: కేసన

రొంపిచర్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీల రక్షణ కోసం చట్టాలను అమలుచేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు శనివారం డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు అట్రాసిటీ చట్టం లాగా బీసీలకు రక్షణ చట్టం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బాదుగున్నల శ్రీను, సరికొండ తిమ్మరాజు, ముక్కడాల శ్రీనివాసరావు, వెంగళరాజు, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో డీఈవో తనిఖీ

రొంపిచర్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొంపిచర్లలోని పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని డీఈవో వెంకటేశ్వర్లు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. అనంతరం మండల వనరుల కేంద్ర భవనంలో రిజిస్టర్లను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో బ్రహ్మేశ్వరరావు, మండల వనరుల కేంద్ర భవన సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సభకు 77 అర్జీలు

నాదెండ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందవరంలో శనివారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రీ సర్వేకు సంబంధించి పలు సమస్యలపై రైతులు, గ్రామస్థులు ఇచ్చిన 77 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఏవీ రమణ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు ఉన్నవారు గ్రామ సభల్లో అర్జీలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎన్.ధనలక్ష్మి, వీఆర్‌వో శ్రీధర్‌బాబు, కార్యదర్శి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా పై నిశ్శబ్ద ర్యాలీ

నరసరావుపేట లీగల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాపై వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో పట్టణంలోని హాండ్స్ ఆఫ్ కంపాషన్ స్వచ్ఛంద సేవా సంస్థ నేతృత్వంలో శనివారం శంకర భారతీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో మానవ అక్రమ రవాణాపై నిశ్శబ్ద ర్యాలీని నిర్వహించారు. ఉమెన్ ట్రాఫికింగ్‌పై అత్యవసర సమయంలో బాధితులు 1098, 181 నంబర్లకు సమాచారం తెలియజేయాలన్నారు. మానవ అక్రమ రవాణాకు సంబంధించి ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉండడం కోసం ఈ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అనంతలక్ష్మి, రూరల్ సీఐ రామకృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు పార్వతి, పాఠశాల సిబ్బంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

జొన్నలగడ్డలో గ్రామసభ

నరసరావుపేట టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలం జొన్నలగడ్డలో రీ సర్వేలో వచ్చిన సమస్యల పరిష్కారం కోసం శనివారం గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ కే వేణుగోపాల్ ప్రజల నుంచి రీసర్వేలో వచ్చిన సమస్యల అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వీఆర్‌వో రఘు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు నల్లపాటి చిన్న సుబ్బయ్య, యర్రం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో న్యాయాధికారుల తనిఖీ

నరసరావుపేట లీగల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు, హైకోర్టుల ఆదేశాల మేరకు స్థానిక న్యాయాధికారులు వసతి గృహాలను తనిఖీ చేస్తున్నారు. పట్టణంలోని రామిరెడ్డిపేటలోని ప్రభుత్వ కళాశాల బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహం3లో స్థానిక న్యాయాధికారులు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ మద్యం సీసాలు, నిషేధిత గుట్కా ప్యాకెట్లతో అపరిశుభ్ర వాతావరణ నెలకొని ఉంది. దీనిపై న్యాయాధికారులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా పట్టణంలోని లింగంగుంట్లలోని ప్రభుత్వ బాలుర సంక్షేమ వసతిగృహం, పెద్ద చెరువులోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాలు, 1, 2 రామిరెడ్డి పేటలోని కళాశాల బాలురు బాలుర వసతిగృహం 3లను తనిఖీ చేశారు.

పీడీ రాధాకృష్ణమూర్తికి సత్కారం

శావల్యాపురం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఎందరో విద్యార్థులను జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యేలా మంచి శిక్షణ ఇచ్చిన పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి సేవలు అభినందనీయమని బెజవాడ చారిటబుల్‌ట్రస్ట్ అధ్యక్షుడు బీవీ నాగేశ్వరరావు అన్నారు. బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీపాఠశాలలో పీడీ రాధాకృష్ణమూర్తికి శనివారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రీ సర్వేలో తప్పుల సవరణకు దరఖాస్తు చేసుకోవాలి: తహసీల్దార్

శావల్యాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో నమోదైన తప్పులను సవరించుకునేందుకు ప్రభుత్వం రీ సర్వే గ్రామ సభలను నిర్వహిస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎఫ్ఏసీ తహసీల్దార్ వేముల వెంకటనాగరాజు అన్నారు. మండలంలోని శానంపూడి సచివాలయంలో శనివారం రీసర్వే గ్రామసభను నిర్వహించారు. కనమర్లపూడి రెవెన్యూ పరిధిలో 13, శానంపూడి రెవెన్యూ పరిధిలో 2 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ టీడీపీ నాయకుడు కొల్లి బ్రహ్మయ్య, టీడీపీ నాయకులు

సిండికేట్ అయిన బార్ అండ్ రెస్టారెంట్ యజమానులు

● టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లి బ్రహ్మయ్య

నరసరావుపేట టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో కొంతమంది బార్ అండ్ రెస్టారెంట్ యజమానులు సిండికేట్ అయి టెండర్ ప్రక్రియను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నిస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లి బ్రహ్మయ్య ఆరోపించారు. శనివారం రావిపాడు రోడ్డులోని ఓ జూనియర్ కళాశాలలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొల్లి బ్రహ్మయ్య మాట్లాడుతూ సత్తెనపల్లి, నరసరావుపేట, చిలకలూరిపేట వాళ్ళు అందరూ కలిసి ఒక సిండికేట్‌లా ఏర్పడి ఇక్కడ ఉన్న నాయకులపై అనవసరమైన ఆరోపణలు చేసి దీనిని మీడియాకు చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విద్యాసంస్థ అధినేత డబ్బు వసూలు చేశారని అనడం సరికాదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు చెప్పినట్టు ఎవరికి వారు టెండర్‌లు వేసుకొని దుకాణాలు వస్తే వ్యాపారం చేసుకుంటున్నారని, ఎక్కడ ఆటంకాలు లేవన్నారు. గురజాల నుంచి వచ్చి ఇక్కడ టెండర్లు వేసుకున్న వారిని కొంతమంది బార్ అండ్ రెస్టారెంట్ వాళ్ళు బెదిరించి సిండికేట్ కావాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వాళ్ళ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఎమ్మెల్యేకి, విద్యాసంస్థ అదినేతకు డబ్బులు ఇచ్చామని చెప్పడం నిజం కాదన్నారు. కొల్లి బ్రహ్మయ్య అంటే ఒక బ్రాండ్ అని, ఏరోజు దందాలు గాని, అక్రమ వ్యాపారాలు గాని చేయలేదన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్‌కుమార్, వాసిరెడ్డి రవీంద్ర, బండారుపల్లి విశ్వేశ్వరరావు, కన్యదార రాజు, జాగర్లమూరి హనుమంతురావు, అబ్బూరి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.అరుణ్ బాబు

కేంద్ర కమిటీకి సహకరించాలి: కలెక్టర్

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): 23 వరకు జిల్లాలో పర్యటించనున్న కేంద్ర కమిటీకి జిల్లాలోని అధికారులు అందుబాటులో ఉండి సహకరించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. కమిటీ పర్యటన సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లోని యస్.ఆర్. శంకరన్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై జాతీయ స్థాయి మానిటరింగ్ కమిటీ ఫేజ్-1 పర్యటించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఎం.జి.యన్.ఆర్.ఈ.జి.యస్., సోషల్ అసిస్టెన్స్, హౌసింగ్, సంహిత వంటి పథకాలపై క్షేత్రస్థాయిలో అమలవుతున్న తీరును కమిటీ పరిశీలించి, కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో మాచర్ల, కారంపూడి, మాచవరం, క్రోసూరు మండలాలలో కమిటీ పర్యటిస్తుందని చెప్పారు. కమిటీ పర్యటనపై మండల ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచించారు. కేంద్ర పథకాలపై సమ్మిళితమైన శాఖలు వారివారి శాఖలకు సంబంధించి సమగ్ర నివేదికలు నమూనాలో అందజేయాలన్నారు. కమిటీ పర్యటనకు సంబంధించి నోడల్ అధికారిగా డ్వామా పీడీ సిద్ధలింగమూర్తిని నియమించినట్లు చెప్పారు. సమావేశంలో జాతీయస్థాయి మానిటరింగ్ కమిటీ లీడర్ లోహిత్ రెడ్డి, శ్రీరాంరెడ్డి, జిల్లా అధికారులు డ్వామా పీడీ బాలునాయక్, హౌసింగ్ పీడీ వేణుగోపాల రావు, జిల్లా పంచాయతీ అధికారి భాస్కరరెడ్డి, జిల్లా సర్వే అధికారి మధుకీర్తి, డీఎల్‌డీవో గబ్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును పరిశీలించిన కమిషనర్

వినుకొండ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం రోడ్డులోని డంపింగ్ యార్డును మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ శనివారం పరిశీలించారు. అక్కడ వ్యర్థ పదార్థాల నిర్వహణ తీరును పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ డ్రైవర్స్ డంపింగ్‌యార్డుకు వెళ్లే దారులలోనే చెత్తను వదులుతున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అరటిపండ్ల వ్యాపారులు అరటిబోదెలను శివారు ప్రాంతాల్లో వేయరాదని, కారంపూడిరోడ్డులోని ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మానేజ్మెంట్ ప్లాంట్‌లో ఎరువు తయారీకి ఇవ్వాలని సూచించారు. అలానే మెడికల్ షాపుల యజమానులు అవుట్ డేటెడ్ మెడిసిన్స్‌ను ఎక్కడపడితే అక్కడ రోడ్లపై వేయరాదని, సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నియమాల ప్రకారమే నిర్వహణ చేయాలని హెచ్చరించారు.

ఘనంగా పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలు

శావల్యాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని శావల్యాపురం, కృష్ణాపురం గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కృష్ణాపురంలో టీడీపీ జిల్లా కార్యదర్శి గడిపూడి విశ్వనాథం, జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షుడు గోరింట్ల హనుమంతరావు, శావల్యాపురంలో టీడీపీ గ్రామాధ్యక్షుడు నలమాటి వెంకటేష్, కర్రి పెదఅంజయ్య పాల్గొని అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.సీతారామయ్య, ఇన్‌చార్జి సర్పంచ్ వై.చెన్నమ్మ, ఏపీవో రామారావు, ఏపీఎం వాసుబాబు, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరస్వామి, సీసీ ఖాజా పాల్గొన్నారు.

మహిళలే మార్పునకు సారధులు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లో మెప్మా బజారును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కలలు గంటున్న పేదరికం లేని ఆంధ్రప్రదేశ్‌ను సాధించుకోవటంలో మహిళలే తొలి మెట్టు, వారే మార్పునకు సారధులు అని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేట పట్టణంలో ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లో మెప్మా బజారును శనివారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి ప్రారంభించారు. అనంతరం మెప్మా బజారులో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి మహిళతో మాట్లాడుతో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో భాగంగా రాష్ట్రంలోని మహిళల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం అనేక చర్యలను చేపడుతుందన్నారు. పీ-4 మోడల్ ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. అందుకోసమే స్వయం సహాయక బృందాలకు వడ్డీలేని రుణాల పరిమితిని రూ.3లక్షల నుంచి రూ.10లక్షల వరకు పెంచుతామని ఉమ్మడి మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విషయాన్ని ప్రత్తిపాటి గుర్తుచేశారు. అందులో భాగంగానే ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మెప్మా బజార్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతా: ప్రత్తిపాటి

నాదెండ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతానని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. నాదెండ్ల మండలంలో కనపర్రు, చిలకలూరిపేట మండలంలోని కమ్మవారిపాలెం గ్రామాల్లో శనివారం జరిగిన పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కనపర్రులో రూ.20లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, కమ్మవారిపాలెంలో రూ.7.50లక్షలతో రహదారి నిర్మాణం తదితర పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీలు తలతోటి రాణి, దేవినేని శంకరరావు, ఎంపీడీవో స్వరూపరాణి, పార్టీ నాయకులు అంబటి సోంబాబు, జయ ప్రసాదు, సింగయ్య, రాఘవయ్య, మరియదాసు, బొల్లయ్య, చంద్ర శ్రీను, శివరామకృష్ణయ్య, నాగేశ్వరరావు, అంతయ్య, ఖాజా మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

యడ్లపాడు మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

యడ్లపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి తెలుగుదేశం ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మాజీ ఎంపీపీ కందిమళ్ళ రఘురామారావు అన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని జాలాది, సందెపూడి, జగ్గాపురం, తుర్లపాడు గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు టీడీపీ నాయకులు శనివారం శంకుస్థాపన చేశారు. జాలాదిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ రఘురామారావు సీసీ రోడ్డు, క్యాటిల్ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జగ్గాపురంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు ముద్దన నాగేశ్వరరావు, గ్రామపార్టీ అధ్యక్షుడు పోపూరి శ్రీనివాసరావు, సందెపూడిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మద్దినీడి రామకృష్ణలు పాల్గొని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఈజీఎస్ టీఏ మాధవి మాట్లాడుతూ నాలుగు గ్రామాలలో సుమారు రూ.31లక్షలతో సీసీ రోడ్లు, క్యాటిల్ షెడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో హేమలత, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు


సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

రొంపిచర్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. శనివారం మండలంలోని మునమాక, విప్పర్లపల్లి, వడ్లమూడివారిపాలెం, ఇంద్రగిరి, రైతునగర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రూ.74లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమెంట్, బీటీ రోడ్ల నిర్మాణాలకు శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రహదారులను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం గ్రామ సభలను నిర్వహించి గ్రామస్థుల ఆమోదంతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు రాష్ట్రంలోని రహదారులకు మహర్దశ కల్పించారన్నారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వినుకొండ మండలంలో...

వినుకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తిమ్మాయిపాలెం, భారతాపురం, దొండపాడు, పెద్దకంచర్ల, గోనుగుంట్లపాలెం గ్రామాల్లో ఈవోపీఆర్‌డీ సుందర్‌రెడ్డి, ఏపీవో నాగేశ్వరరావు, పీఆర్ఏఈ శ్రీనివాసరావులు శనివారం ప్రజా ప్రతినిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ సుందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రానున్న సంక్రాంతి పండుగ నాటికి పనులు పూర్తిచేసి ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేపడతామని ప్రజలకు తెలిపారు. గత ప్రభుత్వంలో పంచాయతీల అభివృద్ధి కుంటుపడిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో పంచాతీల అభివృద్ధికి శ్రీకారం చుట్టామని తెలిపారు.

ఇద్దరు ఉద్యోగులపై క్రిమినల్ కేసులు

● నగదు రికవరీ చేస్తాం ● మునిసిపల్ కమిషనర్ శ్రీహరిబాబు

చిలకలూరిపేట అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గతంలో మునిసిపల్ కార్యాలయంలో అవినీతికి పాల్పడి మునిసిపల్ నిధులు కాజేసిన ఇద్దరు ఉద్యోగులపై క్రిమినల్ చర్యలు తీసుకోవటం జరుగుతుందని మునిసిపల్ కమిషనర్ శ్రీహరిబాబు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మునిసిపాలిటీలో షరాఫ్‌గా పనిచేసిన ప్రవీణ్ అనే వ్యక్తి రూ.13,87185 నగదును మునిసిపాలిటీకి జమ చేయకుండా అవినీతికి పాల్పడ్డారని, అతన్ని సస్పెండ్ చేయటంతో పాటు క్రిమినల్ కేసు పెట్టినట్టు వ్యహరించారు. అలాగే మునిసిపల్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసిన గంగా భవానీ అనే ఉద్యోగి మునిసిపల్ దుకాణాల ద్వారా వచ్చిన అద్దె రూ.34.68 లక్షలను మునిసిపాలిటీకి జమ చేయలేదని, ఆమెను ఉద్యోగం నుంచి తొలగించి ఆమె వద్ద నుంచి రూ.12.94 లక్షలను రికవరీ చేసినట్టు, మిగిలిన సొమ్మును రికవరీ చేయటానికి ప్రయత్నిస్తున్నామని, ఆమెపై కూడా క్రిమినల్ కేసు పెట్టినట్టు తెలియజేశారు. మునిసిపాలిటలో అవినీతికి పాల్పడిన, మునిసిపల్ నిధులను దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని, వారి వద్ద నుంచి నగదు రికవరీ చేయించి మునిసిపాలిటీకి జమ చేస్తామని కమిషనర్ పీ శ్రీహరిబాబు తెలియజేశారు.